Follow: @ANNTELUGU
29-03-2026
# మహా పత్రిక
ANN తెలుగు
ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 91 పేజీలు-08 వెల-రూ.6
FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM





కంది రామచంద్రారెడ్డి

వీకెండ్ అనాలసిస్

## డెవలప్మెంట్ + డివోషన్ = రేవంత్ కొత్త రాజకీయ ఫార్ములా

మూసీ తీరాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరికొత్త రాజకీయఫార్ములాకు తెరతీశారు. రాజకీయ రగడల మధ్య ఆధ్యాత్మిక శంఖం మోగించి ప్రత్యర్థులకు షాకిచ్చారు. మూసీకి ముకుతాడు వేయాలంటే... మంత్రబలం కావాలా? వ్యతిరేక స్వరాలకు సమాధానం... ఆధ్యాత్మిక శక్తుల బలం కూడా ఉండాలని సీఎం భావిస్తున్నట్లు కనబడుతోంది. మేడారం నుంచి భద్రాచలం వరకు, వేములవాడ నుంచి ఓంకారేశ్వరంవరకు... దేవాలయాల రూపంలో సరికొత్త రాజకీయ రేఖలు గీస్తున్నారా? సెంటిమెంట్ ఒక ఆయుధమైతే... వ్యూహం ఒక యుద్ధరంగమైతే... తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయం ముఖ్యమంత్రి ప్రారంభించినట్లు కనబడుతోంది. 2029 లక్ష్యంగా సీఎం రేవంత్ సరికొత్త ఫార్ములాకు పదునుపెట్టి ప్రత్యర్థులు ఊహించని ఎత్తులు వేస్తున్నట్టు కనబడుతోంది. ఐదురాష్ట్రాల ఎన్నికల తర్వాత తన టీమ్ లోనూ ముఖ్యమంత్రి మార్పులుచేర్పులు చేసుకోవడం ఖాయమన్న సంకేతాలు కనబడుతున్నాయి,. మరోవైపు... కవిత రాజకీయ కదలికలు...కొత్త పార్టీ సమీకరణలు చిరుగాలిలా ఉంటాయా.. తుఫాన్ లా ప్రకంపనలు కలిగిస్తాయా? ఏప్రిల్ ఆఖర్లో స్పష్టమవుతుంది.

**- తెలంగాణ తాజా రాజకీయాలపై ఏఎన్ఎన్ సీఈవో, సీనియర్ జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**

ఎడిటోరియల్ పేజీ 4లో

టాప్ న్యూస్

ఐపీఎల్ 2026
## ఆరంభం
- తొలిమ్యాచ్‌లో ఆర్సీబీ శివతాండవం
- సన్‌రైజర్స్‌కు షాక్

02



దురందర్ -2
ఒక బక్వాస్
## సినిమా
- అసదుద్దీన్ ఫైర్

02



అమరావతిని ఎవరూ
## టచ్ చేయలేరు
- 2028 నాటికి రాజధాని నిర్మాణం పూర్తి
- అసెంబ్లీలో టైమ్‌లైన్ ప్రకటించిన చంద్రబాబు
- పవన్‌కు చంద్రబాబు కృతజ్ఞతలు

02

## దద్దరిల్లిన అసెంబ్లీ

మైనింగ్ అంశంపై శాసనసభ దద్దరిల్లింది. పద్దులపై చర్చలో భాగంగా గనుల అంశంపై హరీశ్‌రావు మాట్లాడుతూ మంత్రి పొంగులేటికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించారు. పొంగులేటిని ఉద్దేశిస్తూ హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై మండిపడిన మంత్రులు పదేళ్ల అక్రమాలను ప్రస్తావించారు. బీఆర్ఎస్ సభ్యులు వెల్‌లో బైఠాయించి నినాదాలు చేపట్టగా ఈ క్రమంలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకున్నారు. 2014 జూన్ 2 నుంచి అక్రమ మైనింగ్‌పై సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు. అంతకుముందు హరీశ్‌రావు ను మంత్రులు శ్రీధర్‌బాబు, వాకిటి శ్రీహరి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ లు పొంగులేటి పేరు ప్రస్తావించడాన్ని తప్పుపట్టారు. మంత్రుల సమాధానాలతో సంతృప్తి చెందని బీఆర్ఎస్ శాసనసభ్యులు అసెంబ్లీ వెల్ వద్ద బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉపముఖ్యమంత్రి భట్టి విజ్ఞప్తి చేసినా శాంతించకపోవటంతో జోక్యం చేసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాఘవ కన్‌స్ట్రక్షన్ సహా పదేళ్లలో అక్రమ మైనింగ్ చేపట్టిన సంస్థల అవినీతిపై సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు.



# రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై సీబీసీఐడి విచారణ

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన

- మంత్రి పొంగులేటి కుటుంబ మైనింగ్ సంస్థ అంటూ హరీష్ రావు తీవ్ర ఆరోపణలు
- నా ఆరోపణలు తప్పయితే ఉరివేసుకుంటానంటూ హరీష్ రావు సవాల్
- పొంగులేటిని పనుల కోసం బ్లాక్ మెయిల్ చేస్తున్నారంటూ సీఎం ఫైర్
- రాఘవ కన్ స్ట్రక్షన్స్ కు పొంగులేటికి సంబంధం లేదంటూ ఫైర్
- 12 ఏండ్ల మైనింగ్ కార్యకలాపాలపై సీబీసీఐడి విచారణ జరుపుతామన్న సీఎం
- పొంగులేటిని మంత్రి పదవికి రాజీనామా చేయించి విచారణ ప్రారంభించాలన్న హరీష్ రావు
- హరీష్ ఆరోపణలపై సహనం కోల్పోయిన పొంగులేటి.. 'మొరిగే కుక్కలు' అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై తీవ్ర వ్యాఖ్యలు
- పోడియంలోకి దూసుకెళ్ళిన బీఆర్ఎస్ సభ్యులు.. గందరగోళం

## సభలో సెగలు పుట్టించిన కుక్కలు వ్యాఖ్య..

హరీశ్ రావు ఆరోపణలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ.. అక్రమ మైనింగ్ ఆరోపణలు చేస్తున్న వారిని 'మొరిగే కుక్కలు' అని సంబోధించడంతో బీఆర్ఎస్ సభ్యులు ఒక్కసారిగా భగ్గుమన్నారు. ప్రజాప్రతినిధులపై ఇటువంటి అహంకారపూరిత భాష వాడటాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్ వెల్‌లోకి దూసుకెళ్లారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ, చప్పట్లు కొడుతూ ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించారు. మంత్రి తనయుడు హర్షా రెడ్డి అధికారులను బెదిరిస్తున్నారని, మంత్రి హోదాను అడ్డం పెట్టుకుని వేల కోట్లు కొల్లగొడుతున్నారని విపక్షం చేసిన ఆరోపణలు సభను స్తంభింపజేశాయి. ఈ దశలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జోక్యం చేసుకుని.. ప్రతిపక్షం కేవలం బ్లాక్ మెయిలింగ్ రాజకీయాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. ప్రభుత్వం దేనికైనా సిద్ధమే కానీ, సభను అడ్డుకోవడం సరికాదని హితవు పలికారు.

**హైదరాబాద్,మహా:** రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి చెందిన 'రాఘవ కన్‌స్ట్రక్షన్స్' అక్రమ మైనింగ్ వ్యవహారం శాసనసభలో పెను ప్రకంపనలు సృష్టించింది. ఒకవైపు మాజీ మంత్రి హరీశ్ రావు తన దగ్గరున్న ఆధారాలతో ఇవి తప్పయితే 'నన్ను ఉరి తీయండి' లేదా సస్పెండ్ చేయండి అంటూ సవాల్ విసరగా, గత ప్రభుత్వంలో హరీష్ రావు, కేటీఆర్ లు మైనింగ్ శాఖలో వేలకోట్లు కొల్లగొట్టారంటూ సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విపక్షం దాడి నుండి పొంగులేటిని రక్షిస్తూనే.. సీబీసీఐడి విచారణతో బీఆర్ఎస్ నేతలతో పాటు మంత్రి పొంగులేటికి కూడా సీఎం షాకిచ్చారు. 2014 జూన్ 2 నుండి ఇప్పటిదాకా.. హరీష్ రావు మంత్రిగా పనిచేసిన టైం, కేటీఆర్ మంత్రిగా పనిచేసిన టైం, జోగినపల్లి సంతోష్ తండ్రి చేసిన మైనింగ్, హరీష్ సోదరుడు చేసిన మైనింగ్, గంగుల కమలాకర్, వద్దిరాజు రవిచంద్ర కంపెనీల మైనింగ్, ఇపుడు రాఘవ కన్ స్ట్రక్షన్స్ అన్నింటిపైనా సీబీసీఐడి విచారణ జరిపిస్తానని, వచ్చే సమావేశాల్లోనే సభలోకి నివేదిక తీసుకొస్తామని సీఎం రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు.

మిగతా 2లో



మూసీ ప్రక్షాళనకు అడ్డుపడితే
# శివతాండవమే
### ప్రతిపక్షాలకు సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరిక

సబితక్కా.. అడ్డుపడితే సామాజిక బహిష్కరణే

రూ.700 కోట్లతో రామప్ప శైలిలో ఓంకారేశ్వరాలయం



**హైదరాబాద్, మహా.** "ఓట్లు, నోట్ల కోసం మేము మూసీ నదిని అభివృద్ధి చేయడం లేదు.. ఈ నగరాన్ని కాపాడాలనే పవిత్ర లక్ష్యంతో, భగవంతుడి ఆశీస్సులతో ఈ మహాయజ్ఞానికి శ్రీకారం చుట్టాం. దశాబ్దాల పాపాన్ని కడిగేసే ఈ పుణ్యకార్యాన్ని ఎవరైనా రాజకీయ లబ్ధి కోసం అడ్డుకోవాలని చూస్తే రాష్ట్ర ప్రభుత్వం శివతాండవం చూపిస్తుంది" అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలను తీవ్రస్థాయిలో హెచ్చరించారు. శనివారం గండిపేట మండలం మంచిరేవుల వద్ద రూ.700 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఓంకారేశ్వర ఆలయానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, మూసీ పునరుజ్జీవనం అనేది కేవలం ఒక ప్రాజెక్టు మాత్రమే కాదని,

మిగతా 2లో

## వదంతులతోనే పెట్రో సమస్యలు

వదంతులు నమ్మొద్దు.. బంకుల్లో ఇంధనం పుష్కలం

యుద్ధం ముగిసే వరకు సంయమనం పాటించాలి

మీడియా సమావేశంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, మహా:** "తెలంగాణలో గత వారం రోజులుగా పెట్రోల్ బంకుల వద్ద కనిపిస్తున్న కిలోమీటర్ల మేర క్యూలు, ప్రజల్లో నెలకొన్న భయాందోళనల వెనుక వాస్తవాల కంటే వదంతులే ఎక్కువగా ఉన్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. పశ్చిమాసియాలో రగులుతున్న యుద్ధ జ్వాలలు అంతర్జాతీయ సరఫరా గొలుసును దెబ్బతీస్తున్న మాట వాస్తవమే అయినా, దేశంలో ఇంధన కొరత ఉందన్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వదంతులు నమ్మొద్దని ఆయిల్ కంపెనీల యాజమాన్యాలతో కలిసి సమావేశం నిర్వహించారు.

మిగతా 2లో



## మారణహోమం వద్దు.. శాంతియే ముద్దు

- ప్రొఫెసర్ కోదండరాం
- నేడు చార్మినార్ నుంచి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వరకు యుద్ధ వ్యతిరేక ర్యాలీ



02



# రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై సీబీసీఐడి విచారణ

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి చెందిన 'రాఘవ కన్‌స్ట్రక్షన్స్' అక్రమ మైనింగ్‌పై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు విరుచుకుపడ్డారు. శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ గ్రామం (సర్వే నంబర్ 62, 63)లో రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా భారీ స్టోన్ క్రషర్‌ను నడుపుతోందని హరీష్ రావు ఆరోపించారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతోందని, చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. "లైసెన్స్ లేకుండా అక్రమ మైనింగ్ చేస్తే ఏడాది జైలు శిక్ష పడాలని చట్టం చెబుతోంది. మరి ఇన్ని నోటీసులు ఇచ్చినా, మైనింగ్ శాఖ లేఖలు రాసినా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?" అని హరీష్ రావు ప్రశ్నించారు. "మహిపాల్ రెడ్డి తమ్ముడు నా తమ్ముడు లాంటి వాడు. 20 ఏళ్లుగా మేమంతా కలిసి పనిచేశాం. చిన్న తప్పు జరిగిందని ఆయనను రాత్రికి రాత్రే అరెస్ట్ చేసి నెల రోజులు జైల్లో పెట్టారు. మరి పొంగులేటి సంస్థపై ఎందుకు చర్యలు లేవు? ప్రతిపక్షానికి ఒక న్యాయం, అధికార పక్షానికి ఒక న్యాయమా?" అంటూ నిలదీశారు. అక్రమ మైనింగ్‌పై తాను ట్వీట్ చేస్తే.. మంత్రి పొంగులేటి తనను "మొరిగే కుక్కలు" అంటూ సంబోధించడాన్ని హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. "నన్ను అంత మాట అన్నందుకే నేరుగా చెబుతున్నాను.. అది పొంగులేటి సంస్థే! అక్కడ కాంగ్రెస్ జెండాలు ఉన్న ఆధారాలు మా దగ్గర ఉన్నాయి. ఆయన మంత్రిగా ఉంటే విచారణ సరిగ్గా జరగదు. అందుకే వెంటనే రాజీనామా చేసి ఎంక్వైరీకి ఆదేశించాలి" అని డిమాండ్ చేశారు. తాను చెబుతున్న ఆధారాలు తప్పని నిరూపిస్తే నన్ను ఉరి తీయండి లేదా సభ నుంచి సస్పెండ్ చేయండి అంటూ ఆయన చేసిన ప్రకటన సభను ఉక్కిరిబిక్కిరి చేసింది.



### పొంగులేటిపై కుట్ర- విపక్షంపై సీఎం రేవంత్ ఫైర్

బీఆర్ఎస్ వాళ్లు విచారణ కావాలని అడుగుతున్నారని.. అసెంబ్లీ వేదికగా ప్రతిపక్షానికి, ప్రజలకు మాట ఇస్తున్నానని సీఎం రేవంత్ చెప్పారు. విచారణకు ఆదేశించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని తెలిపారు. 'నాడు సిరిసిల్ల నియోజకవర్గంలో నేరెళ్లలో ఇసుక బాధితులు దళితులను లారీ ఎక్కించి, తొక్కించి చంపి ఇసుక అక్రమ రవాణా చేసిన సంతోష్‌రావు, ఆయన తండ్రి రవీందర్‌రావుకు చెందిన నేరెళ్ల ఇసుక మాఫియా మీద విచారణ చేయడానికి మా ప్రభుత్వం సిద్ధం ఉంది. అలాగే.. సర్వే 168 శిరీష జియో గ్రానైట్‌స్‌కు సంబంధించి ఏపీకి చెందిన మాజీ ఎమ్మెల్యేను బెదిరించి గతంలో మైనింగ్ శాఖ మంత్రిగా పనిచేసిన వ్యక్తి అక్రమంగా మైనింగ్ లీజును రాయించుకున్నారు. అక్రమంగా మైనింగ్ చేశారని.. దీని మీద విచారణకు సిద్ధం. అదేవిధంగా మిడ్వెస్ట్ గ్రానైట్‌స్‌కు సంబంధించి నేడు రెవెన్యూ మంత్రిని బ్లాక్ మెయిల్ చేసే ప్రయత్నం చేస్తున్న ఎమ్మెల్యేకు చెందిన తమ్ముడు ఇల్లీగల్‌గా మైనింగ్ చేసుకున్నాడు. ఇందులో జరిగిన దోపిడీపై మిడ్వెస్ట్ గ్రానైట్స్ మీద విచారణకు ఆదేశిస్తాం. అలాగే, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, వారి కుటుంబసభ్యులకు చెందిన శ్వేత గ్రానైట్‌స్‌లో అక్రమ మైనింగ్ జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదికనే కాకుండా ఈడీ విచారణ సైతం జరుగుతోంది. శ్వేత గ్రానైట్‌స్‌కు సంబంధించి ఇల్లీగల్ మైనింగ్‌పైనా విచారణకు ఆదేశించడానికి సిద్ధంగా ఉన్నా. అలాగే.. ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు చెందిన గాయత్రి గ్రానైట్స్ అక్రమంగా రాయించుకున్నారు. ఈ అక్రమ మైనింగుల మీద విచారణ వేయడానికి మేం సిద్ధంగా ఉన్నాం' అని వివరించారు. హరీశ్‌రావు సొంత తమ్ముడు మహేశ్‌రావు దోపిడీకి పాల్పడ్డారని.. హరీశ్‌రావు మంత్రిగా దోచిపెట్టారని ఆరోపించారు. వీటన్నింటి మీద సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలిపారు. అందరి నిగ్గుతేలుస్తానని హెచ్చరించారు. రాష్ట్రాన్ని కొల్లగొట్టిందే బీఆర్ఎస్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్లు హరీశ్‌రావు, ఐదేళ్లు కేటీఆర్ ఈ శాఖను నిర్వహించి వేల కోట్ల రూపాయలను కొల్లగొట్టారన్నారు. ఇసుక మాఫియాను నడిపి దోపిడీకి పాల్పడ్డారన్నారు. తాము పెంచిన ఆదాయం కళ్ల ముందు ఉన్నదని తెలిపారు. ఇసుకకు సంబంధించి 202425లో రూ.721 కోట్ల ఆదాయం ఉంటే.. 2025 26లో రూ.972 కోట్లకు పెంచామన్నారు. ఇసుక దోపిడీకి పాల్పడి ఇంకా కన్‌స్ట్రక్షన్ కుంటుపడిందని.. రియల్ ఎస్టేట్ దెబ్బతిన్నదని అంటున్నారని అన్నారు. రియల్ ఎస్టేట్ దెబ్బ తింటే తాము ఇసుకను ఏమైనా బుక్కుతున్నామా..? బిర్యానీ వండుకొని తింటున్నామా..? అని ప్రశ్నించారు. ఏడాదికి రూ.1,000 కోట్లను కేవలం ఇసుక దందాలోనే హరీశ్‌రావు, కేటీఆర్ దోపిడీకి పాల్పడ్డారని.. ఈ మాఫియాకు నాయకత్వం వహించిందే వీరని పేర్కొన్నారు. మొదట్లో ఈ శాఖ హరీశ్‌రావు దగ్గర ఉండేదని.. ఆయన అడ్డగోలుగా దోపిడీకి పాల్పడుతున్నారని కేసీఆర్ ఆ శాఖను తొలగించారని అన్నారు. ఈ విషయంలో కొడుకు, అల్లుడు మధ్య పంచాయితీ పడితే దానిని తెంపడానికి ఆ శాఖను కేటీఆర్ దోచుకునేందుకు అవకాశం ఇచ్చారని ఆరోపించారు. జూన్ 2, 2014 నుంచి ఇప్పటివరకు మైనింగ్ లీజుల మీద, జరిగిన అక్రమాల మీద, ఆయా అక్రమ మైనింగుల మీద పూర్తిస్థాయిలో సీబీసీఐడీతో విచారణ జరిపించి.. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో పూర్తి నివేదికను ప్రవేశపెడుతామని స్పష్టం చేశారు. గత పదేళ్లు వారు పాల్పడిన దోపిడీ బయటపడుతున్నదని.. అందుకే ఈ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని రేవంత్ అన్నారు. ఏ బురద జల్లినా ఇక్కడ భయపడే వారు ఎవరూ లేరని స్పష్టం చేశారు.

#### సొంత చెల్లిని గెంటేశారు..

మంత్రిని భయపెట్టి భూములు రాయించుకోవాలనుకునే ప్రయత్నాలు తమ వద్ద ఉడకవని సీఎం రేవంత్ హెచ్చరించారు. ఆ కంపెనీతో తనకు, తన కుటుంబానికి సంబంధం లేదని సదరు మంత్రి గతంలోనే చెప్పారని అన్నారు. బంధువులు, దూరపు బంధువులు ఉంటే వారిది అయిపోతదా అని ప్రశ్నించారు. తెలంగాణలో కానీ, ఏపీలో కానీ ఏ రెడ్డి అయినా ఇంకో రెడ్డికి దగ్గర లేదా దూరపు బంధువు ఉంటారని అన్నారు. 'సొంత అన్నదమ్ముళ్లకే ఆదాయంలో, పంపకాలల్ల తేడాలు వస్తున్నాయి. అంతెందుకు కల్వకుంట్ల తారక రామారావు, కల్వకుంట్ల కవిత రావు మధ్య ఆదాయ పంపకాల్లో తేడా వస్తే సొంత చెల్లినే మెడలు పట్టి బయటకు గెంటేశారు' అని అన్నారు. పొంగులేటికి సంబంధించి ఎవరో బంధువులకు వ్యాపారం ఉంటే.. పొంగులేటికి ఏం సంబంధం అని ప్రశ్నించారు. వీళ్లు సొంత చెల్లిని ఇంట్లో నుంచి పార్టీలో నుంచి వెళ్లగొట్టి.. దోపిడీకి పాల్పడ్డారని అన్నారు. ఎవరో చేస్తున్న వ్యాపారాన్ని పొంగులేటికి అంటబెట్టాలని చూస్తున్న ప్రయత్నం దిక్కుమాలిన చర్య అని హెచ్చరించారు. ఇలాంటి దిక్కుమాలిన ప్రయత్నాలు చేయొద్దని.. వీటిలో ఎలాంటి ప్రయోజనం ఉండదని అన్నారు. ఇసుక, లీజు మాఫియాలో చేసిన ప్రయత్నాలన్నీ తేలుస్తామని.. ఒక్కొక్కరి సంగతి చూస్తామని హెచ్చరించారు.

#### మంత్రిని బ్లాక్ మెయిల్ చేస్తున్నారు

బ్లాక్‌మెయిలింగ్‌కు తమ ప్రభుత్వం భయపడేది లేదని.. ఇలాంటి బ్లాక్‌మెయిల్ ఎక్కడైనా జరగచ్చు కానీ తమ దగ్గర నడువవు అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం మైనింగ్ డిమాండ్స్‌పై చర్చలో భాగంగా హరీశ్‌రావు మాట్లాడిన అనంతరం రేవంత్‌రెడ్డి ఆయనకు కౌంటర్ ఇచ్చారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని భయపెట్టి అక్రమ పనులు చేయించుకోవాలని బీఆర్ఎస్ నేతలు చూస్తున్నారని.. ఆయన ఒప్పుకోకపోవడం వల్లనే అనవసర ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ఎక్కడ రాష్ట్ర ఆదాయానికి గండిపడినా.. రాష్ట్ర ఖనిజ సంపద, ఇతర ప్రభుత్వ ఆదాయానికి గండిపడే ఎలాంటి తప్పిదాలు జరిగినా తమ ప్రభుత్వం ఉపేక్షించే ఆలోచన చేయలేదని అన్నారు. నేడు ప్రతిపక్ష సభ్యులు రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు సంబంధించి ఆరోపణలు లేవనెత్తారని.. కానీ, ఈ సంస్థకు నోటీసులు ఇచ్చింది.. దీనికి సంబంధించి చర్యలు తీసుకోమన్నదే తమ ప్రభుత్వమని చెప్పారు. అంతేకాకుండా సీనరేజీ చార్జి కింద రూ.1,52,97,825, పర్మిట్ ఫీజు కింద రూ.1,22,25,446 రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేటు లిమిటెడ్ నుంచి పన్నులు కట్టించామని వెల్లడించారు. బీఆర్ఎస్ సభ్యులు మంత్రి పేరు తీసుకొని అనవసర ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఇది వారు కనిపెట్టి, వారు ఫిర్యాదు చేస్తే తాము చర్యలు చేపట్టలేదని తెలిపారు. తమ ప్రభుత్వమే దీనికి సంబంధించిన వివరాలు సేకరించి.. ఆ సంస్థకు నోటీసులు ఇచ్చి.. బకాయిలు వసూలు చేశామని చెప్పారు. అనుమతులను కూడా పరిశీలించి.. చర్యలు తీసుకోవాలని తామే ముందుకు వచ్చామన్నారు. కానీ, ఇందులో ఎవరూ ఎలాంటి ఫిర్యాదులు చేయలేదన్నారు. వివాదం లేవనెత్తాలని.. మంత్రి మీద బురదజల్లాలని.. అక్కసు వెల్లగక్కుతున్నారని అన్నారు. వారు అనుకున్న పైరవీలకు మంత్రి సహకరించడం లేదని.. మంత్రి మీద ఒత్తిడి తీసుకురావాలని.. మంత్రిని బ్లాక్‌మెయిల్ చేయాలని వారంతా ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. పర్యావరణ శాఖకు ఫిర్యాదు చేసిందే తమ ప్రభుత్వమని తెలిపారు.

## మూసీ ప్రక్షాళనకు అడ్డుపడితే శివతాండవమే

### ప్రతిపక్షాలకు సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరిక



(మొదటిపేజీ తరువాయి)

అది తెలంగాణ ఆత్మగౌరవానికి, భవిష్యత్ తరాల ఆరోగ్యానికి సంబంధించిన అత్యవసరమైన చర్య అని ఉద్ఘాటించారు. ముఖ్యమంత్రి తన కుటుంబ సభ్యులతో కలిసి తొలుత చారిత్రక వీరభద్ర మచిలేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో ప్రపంచ ప్రఖ్యాత రామప్ప దేవాలయ శిల్పకళా రీతిలో నిర్మించనున్న ఓంకారేశ్వర ఆలయ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానవ తప్పిదాల వల్ల హైదరాబాద్ నగరం కనుమరుగయ్యే పరిస్థితి దాపురించిందని, మూసీ కాలుష్యం వల్ల నల్గొండ జిల్లా ప్రజలు నరకం అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1400 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ప్రాంతాన్ని పునరుద్ధరించడం దైవ నిర్ణయమని, గత పాలకులు ఎందరు ప్రయత్నించినా సాధ్యం కాని ఈ పనిని తమ ప్రభుత్వం శివదీక్షగా చేపట్టిందని పేర్కొన్నారు. మూసీ నది కేవలం మురుగు కాలువగా మిగిలిపోకూడదని, 365 రోజులు అందులో మంచినీరు ప్రవహించేలా 20 టీఎంసీల గోదావరి జలాలను గండిపేట, హిమాయత్ సాగర్ జంట జలాశయాలకు తరలించి, అక్కడి నుంచి 5 టీఎంసీలను నిరంతరం మూసీలోకి విడుదల చేస్తామని అభయం ఇచ్చారు. రాష్ట్రంలో మత సామరస్యం వెల్లివిరిసేలా మూసీ తీరాన్ని తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి ప్రకటించారు. మంచిరేవులలో నిర్మిస్తున్న ఈ ఓంకారేశ్వర ఆలయం 'దక్షిణ కాశి'గా విరాజిల్లడమే కాకుండా, నది పొడవునా ఇతర మతాల ప్రార్థనా మందిరాలను కూడా ప్రభుత్వం నిర్మించనుందని వెల్లడించారు. పురానాపూల్ వద్ద ఒక భారీ మసీదును, గౌలిగూడలో గురుద్వారాను, నాగోల్ ప్రాంతంలో మెదక్ చర్చి తరహాలో ఒక అద్భుతమైన చర్చిని నిర్మిస్తామని, తద్వారా హైదరాబాద్ గంగాజమునా తెహజీబ్ సంస్కృతిని ప్రపంచానికి చాటుతామని వివరించారు. ఈ పనులన్నీ అత్యంత పారదర్శకంగా, పర్యాటక మరియు ఆధ్యాత్మిక విలువలతో కూడి ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

**సబితక్కా.. సామాజిక బహిష్కరణే**

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తీరుపై ముఖ్యమంత్రి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ ప్రాంతం నుంచి రాజకీయంగా ఎదిగి అన్ని పదవులను అనుభవించిన ఆమె, ఇప్పుడు తన కుమారుడితో నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ లో కేసులు వేయించి మూసీ అభివృద్ధిని అడ్డుకోవాలని చూడటం శోచనీయమని విమర్శించారు. "మీకు ప్రజాప్రతినిధిగా కొనసాగే అర్హత ఉందా?" అని ఆమెను నిలదీశారు. అభివృద్ధిని అడ్డుకునే వారు ప్రజల ముందు దోషులుగా నిలబడక తప్పదని హెచ్చరించారు. సామాజిక బహిష్కరణ తప్పదని హెచ్చరించారు. మూసీ ప్రాజెక్టు వల్ల ఆ పరివాహక ప్రాంతం ఒక అద్భుతమైన వ్యాపార, ధ్యాన మరియు పర్యాటక కేంద్రంగా మారుతుందని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఈ యజ్ఞాన్ని పూర్తి చేసి తీరుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.



## వదంతులతోనే పెట్రో సమస్యలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న యుద్ధ వాతావరణం పెట్రోలియం ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం చూపుతోందని కిషన్ రెడ్డి విశ్లేషించారు. మనం అధికంగా దిగుమతులపైనే ఆధారపడుతున్న తరుణంలో, గ్లోబల్ మార్కెట్‌లో ధరలు పెరిగినా, సరఫరాలో ఆటంకాలు ఎదురైనా సామాన్య భారతీయుడిపై ఆ భారం పడకుండా మోదీ ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తోందని చెప్పారు. "ఎంత ధర చెల్లించైనా సరే, దేశానికి అవసరమైన చమురును తీసుకురావడంలో ప్రభుత్వం వెనకడుగు వేయదు. ప్రతిరోజూ విదేశీ నాయకులతో చర్చలు జరుపుతూ సరఫరా నిరంతరాయంగా కొనసాగేలా చూస్తున్నాం" అని ఆయన భరోసా ఇచ్చారు.

**వదంతులే పెద్ద శత్రువు**

పెట్రోల్ పంపుల వద్ద రద్దీకి సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు ప్రచారమే ప్రధాన కారణమని మంత్రి మండిపడ్డారు. "కొరత ఉందనే చిన్న పుకారు ప్రజలను బంకుల వైపు పరుగులు తీయిస్తోంది. దీనివల్ల అనవసరమైన కృత్రిమ కొరత ఏర్పడుతోంది. ఆయిల్ కంపెనీలు ఇప్పటికే స్పష్టం చేశాయి.. మన దగ్గర నిల్వలు నిండుగా ఉన్నాయి. ఎవరూ ఆందోళన చెంది ట్యాంకులు ఫుల్ చేసుకోవాల్సిన అవసరం లేదు" అని ఆయన విజ్ఞప్తి చేశారు.

**మారుతున్న ఇంధన సంస్కృతి.. 'ఉజ్వల' విప్లవం**

దేశంలో ఇంధన వినియోగం పెరగడం అభివృద్ధికి సూచిక అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో కట్టెలు, కిరోసిన్ వాడిన నిరుపేదలు నేడు 'ఉజ్వల' పథకం ద్వారా ఎల్పీజీ సిలిండర్లు వాడుతుండటం ఆరోగ్యకరమైన మార్పు అని కొనియాడారు. అయితే, పెట్రోల్ వాడకాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ ఇంధనాల వైపు మళ్లాల్సిన సమయం ఆసన్నమైందని, అందుకే కేంద్రం ఎలక్ట్రిక్ వాహనాలను భారీగా ప్రోత్సహిస్తోందని చెప్పారు. రైల్వేల విద్యుదీకరణ కూడా చమురు దిగుమతులపై భారాన్ని తగ్గించడానికేనని ఆయన వివరించారు.

## దురంధర్ -2 ఒక బక్వాస్ సినిమా

### అసదుద్దీన్ ఫైర్

**మహా:** ధురంధర్2 సినిమా సమాజంలో విభజనను పెంచుతోందని, ఇది ఒక బక్వాస్ సినిమా అంటూ మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలీవుడ్ నటుడు రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో, ప్రముఖ దర్శకుడు ఆదిత్య ధర్ తెరకెక్కించిన చిత్రం ధురంధర్2 వసూళ్లలో సరికొత్త రికార్డులు సృష్టిస్తుండగా, ఈ చిత్రంపై అసదుద్దీన్ విమర్శలు గుప్పించారు. ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాలు, సంభాషణలు హింసను ప్రేరేపించేలా ఉన్నాయని ఆరోపించారు. ఇది ఒక అర్థం లేని సినిమా అని ధ్వజమెత్తారు. ఇలాంటి సినిమాల ద్వారా ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకోవడం లేదా దేశభక్తి పేరుతో విద్వేషాన్ని వ్యాప్తి చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. ఇలాంటి చిత్రాలు యువతపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సినిమాలు చూసేందుకు ఎవరి దగ్గర అంత సమయం లేదని అన్నారు.

## నిజామాబాద్ నగరాభివృద్ధికి బడ్జెట్ భరోసా




- పాలకమండలి సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కీలక దిశానిర్దేశం!
- ప్రతి వార్డుకూ సమాన ప్రాధాన్యం.. మౌలిక వసతులే ప్రథమ లక్ష్యం

**నిజామాబాద్, మహా:** నిజామాబాద్ నగర పాలక సంస్థ 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్ సమావేశం శనివారం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. నగర సర్వతోముఖాభివృద్ధిని కాంక్షిస్తూ రూపొందించిన ఈ బడ్జెట్ చర్చా కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేకంగా పాల్గొన్నారు. నగర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుపై ఆయన అధికారులకు, ప్రజాప్రతినిధులకు కీలక సూచనలు చేశారు. నగర పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలను అందించడమే లక్ష్యంగా ప్రణాళికలు ఉండాలని ఆయన ఆకాంక్షించారు. నగరంలోని ప్రతి గల్లీలోనూ అభివృద్ధి పరిమళాలు విరజిమ్మాలన్నదే ప్రభుత్వ ఆశయమని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు. ముఖ్యంగా అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ, నిరంతర తాగునీటి సరఫరా మరియు వీధి దీపాల ఏర్పాటు వంటి ప్రాథమిక అవసరాలకు బడ్జెట్‌లో పెద్దపీట వేయాలని సూచించారు. ప్రజలకు అందే సేవల్లో ఎటువంటి జాప్యం ఉండకూడదని, ప్రతి పనిలోనూ పారదర్శకత ఉట్టిపడాలని ఆయన అధికారులను ఆదేశించారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి వార్డును సమానంగా చూడాలని, నిధుల పంపిణీలో ఎటువంటి వివక్షకు తావులేకుండా కేవలం ప్రజా అవసరాల ప్రాతిపదికన పనులు చేపట్టాలని కోరారు. నగర విస్తరణకు అనుగుణంగా మౌలిక వసతులను యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తుచేశారు. రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం సామాన్యుడి సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, బడ్జెట్ కేటాయింపులు కేవలం అంకెలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజల కష్టాలను తీర్చేవిగా ఉండాలని మహేష్ గౌడ్ పేర్కొన్నారు. నిజామాబాద్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అదనపు నిధుల సమీకరణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. అధికారులు తమ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి, అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని పిలుపునిచ్చారు. నగర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శక పాలన అందించడమే ధ్యేయంగా కౌన్సిల్ సభ్యులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

## అమరావతిని ఎవరూ టచ్ చేయలేరు

- 2028 నాటికి రాజధాని నిర్మాణం పూర్తి
- అసెంబ్లీలో టైమ్‌లైన్ ప్రకటించిన చంద్రబాబు
- పవన్‌కు చంద్రబాబు కృతజ్ఞతలు

**అమరావతి, మహా:** "ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతి ప్రాభవాన్ని పునరుద్ధరిస్తూ శాసనసభ శనివారం చారిత్రక తీర్మానాన్ని ఆమోదించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన ప్రసంగం ఆద్యంతం భావోద్వేగంగా సాగింది. ముఖ్యంగా జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి సీఎం చేసిన వ్యాఖ్యలు సభలో చర్చనీయాంశమయ్యాయి. రాష్ట్ర భవిష్యత్తు కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పవన్ కల్యాణ్ చూపిన తెగువ, అందించిన మద్దతును రాష్ట్రం ఎన్నటికీ మరవలేదని చంద్రబాబు కొనియాడారు. కూటమి ఏర్పాటు నుంచి చారిత్రక విజయం వరకు పవన్ పాత్రను వివరిస్తూ ఆయనకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు."

**పవన్ అండ.. రాష్ట్రానికి కొండంత దమ్ము!**

2014 నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ, ఆనాడు బీజేపీతో పొత్తు కుదిరిన తర్వాత తాను స్వయంగా పవన్ కల్యాణ్ ఇంటికి వెళ్లిన విషయాన్ని చంద్రబాబు ప్రస్తావించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పవన్ ఎటువంటి షరతులు లేకుండా మద్దతు ప్రకటించారని, ఆ మాటపై నేటికీ కట్టుబడి ఉన్నారని ప్రశంసించారు. ముఖ్యంగా 2024 ఎన్నికలకు ముందు తాను జైల్లో ఉన్న క్లిష్ట పరిస్థితుల్లో, విపక్షాలన్నీ ఏకమైతేనే రాష్ట్రాన్ని కాపాడుకోగలమని పవన్ తీసుకున్న చొరవ అసాధారణమైనదని సీఎం అభివర్ణించారు. ఆ ఐక్యత వల్లే నేడు 175 స్థానాలకు గాను 164 సీట్లు గెలిచి, 94 శాతం స్ట్రైక్ రేట్‌తో ఒక రికార్డు విజయాన్ని నమోదు చేయగలిగామని స్పష్టం చేశారు.

**వైసీపీ ముక్కలాట.. అమరావతికి ద్రోహం!**

గత వైసీపీ ప్రభుత్వంపై ముఖ్యమంత్రి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'మూడు రాజధానుల' పేరుతో వైసీపీ ఆడిన 'మూడు ముక్కలాట' రాష్ట్ర అభివృద్ధిని పదేళ్లు వెనక్కి నెట్టిందని మండిపడ్డారు. అమరావతిని శివసేన, బీజేపీ నుంచి కాంగ్రెస్ వరకు అందరూ ఆమోదించినప్పటికీ, కేవలం రాజకీయ కక్ష సాధింపు కోసమే రాజధానిని నాశనం చేశారని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన ఒక నగరం పనులు ఆగిపోయి, మళ్లీ ప్రారంభం కావడం ప్రపంచ చరిత్రలో అమరావతిలోనే జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో అమరావతి రైతులు పడిన బాధలకు ప్రజలే తమ ఓటుతో తగిన తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు.

**2028 నాటికి నవ నగరం సిద్ధం**

అమరావతి నిర్మాణ పనులపై ముఖ్యమంత్రి స్పష్టమైన గడువులను ప్రకటించారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రూ. 15,000 కోట్లు మంజూరు చేసిందని, మే 2, 2025 నుంచి పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. మంత్రి నారాయణ అడిగిన ప్రశ్నకు సమాధానంగా.. ట్రంక్ రోడ్లు, అసెంబ్లీ, హైకోర్టు మరియు ఐకానిక్ టవర్ల పూర్తికి సంబంధించిన స్పష్టమైన కాలక్రమ పట్టికను సభ ముందు ఉంచారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణీత సమయంలోనే రాజధానిని పూర్తి చేసి తీరుతామని చంద్రబాబు ఘంటాపథంగా చెప్పారు.

## మారణహోమం వద్దు.. శాంతియే ముద్దు

- ప్రొఫెసర్ కోదండరాం
- నేడు చార్మినార్ నుంచి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వరకు యుద్ధ వ్యతిరేక ర్యాలీ



**హైదరాబాద్, మహా.** "పశ్చిమాసియాలో కమ్ముకున్న యుద్ధ మేఘాలు ప్రపంచ మానవాళి ఉనికికే ముప్పుగా పరిణమిస్తున్నాయని, ఈ వినాశకర పోకడలను అడ్డుకోవడానికి ప్రతి ఒక్కరూ శాంతి గళం విప్పాలని ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఇరాన్, అమెరికాల మధ్య సాగుతున్నది కేవలం దేశాల మధ్య ఘర్షణ మాత్రమే కాదని, అది చమురు, ఖనిజ సంపదను కొల్లగొట్టేందుకు అమెరికా సామ్రాజ్యవాద దృక్పథంతో సాగిస్తున్న అన్యాయమైన మారణహోమమని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా ఆదివారం ఉదయం 10:30 గంటలకు చార్మినార్ నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వరకు భారీ 'యుద్ధ వ్యతిరేక ర్యాలీ' నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ శాంతి యాత్రను విజయవంతం చేసి అంతర్జాతీయ సమాజానికి బలమైన సందేశం పంపాలని కోరారు."

అమెరికా తన ఆధిపత్య వైఖరితో గతంలో ఇరాక్, వెనిజులా దేశాలను అస్థిరపరిచిందని, ఇప్పుడు అదే జాత్యహంకార ధోరణితో ఇరాన్‌పై దాడులకు దిగుతోందని కోదండరాం ఆవేదన వ్యక్తం చేశారు. వనరుల వేటలో భాగంగా ప్రారంభమైన ఈ యుద్ధం నూతన వలసవాద భావజాలంతో సాగుతోందని దుయ్యబట్టారు. యుద్ధం ఇలాగే కొనసాగితే వేలాది మంది అమాయకులు ప్రాణాలు కోల్పోవడమే కాకుండా, ప్రపంచం మరో తీవ్ర ఆర్థిక మాంద్యం కోరల్లో చిక్కుకుంటుందని హెచ్చరించారు. ఇప్పటికే అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ విధించిన ఏకపక్ష సుంకాల వల్ల కుదేలైన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, తాజా యుద్ధ పరిణామాలతో పూర్తిగా కుప్పకూలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్, నెతన్యాహు ద్వయం ఎటువంటి కారణం లేకుండా సాగిస్తున్న ఈ ఘర్షణలు ప్రపంచ శాంతికి గొడ్డలిపెట్టుగా మారాయని విమర్శించారు. ముఖ్యంగా భారతదేశం వంటి చమురు దిగుమతులపై ఆధారపడే దేశాలకు ఈ యుద్ధం పెను సవాలుగా మారిందని కోదండరాం విశ్లేషించారు. పెట్రోల్, గ్యాస్ ధరల పెరుగుదల వల్ల సామాన్యుల జీవితాలు దుర్భరమవుతున్నాయని, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని పేర్కొన్నారు. యుద్ధ ప్రభావం వల్ల దేశంలోని చిన్న వ్యాపారాలు, హోటళ్లు మూతపడి ఉపాధి దెబ్బతింటోందని చెప్పారు. గల్ఫ్ దేశాలలో నివసిస్తున్న సుమారు 15 లక్షల మంది తెలంగాణ కార్మికులతో పాటు, కోటి మందికి పైగా భారతీయుల భద్రత ఇప్పుడు ప్రశ్నార్థకమైందని గుర్తుచేశారు. ఈ భయానక పరిస్థితుల దృష్ట్యా భారత్ కేవలం ప్రేక్షక పాత్రకే పరిమితం కాకుండా, అలీనోద్యమ స్ఫూర్తితో శాంతి స్థాపనకు చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

# ఐపీఎల్ 2026 ఆరంభం

## తొలిమ్యాచ్ లో ఆర్సీబీ శివతాండవం.. సన్ రైజర్స్ కు షాక్



**బెంగళూరు, మహా.**

ఐపీఎల్ 2026 సీజన్ అట్టహాసంగా ప్రారంభమైంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగిన ఉత్కంఠభరితమైన తొలి మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అద్భుత విజయాన్ని నమోదు చేసింది. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) జట్ల మధ్య జరిగిన ఈ ఆరంభ పోరులో బెంగళూరు జట్టు సర్వశక్తులూ ఒడ్డి అద్భుత విజయాన్ని అందుకుంది. మ్యాచ్ ప్రారంభానికి ముందు స్టేడియం మొత్తం ఒక రకమైన నిశ్శబ్దంలో మునిగిపోయింది. గతేడాది ఆర్సీబీ విజయోత్సవాల్లో ప్రాణాలు కోల్పోయిన 11 మంది అభిమానుల జ్ఞాపకార్థం ఇరు జట్ల ఆటగాళ్లు నల్ల బ్యాండ్లు ధరించి, ఒక నిమిషం మౌనం పాటించి నివాళులర్పించారు. మృతుల కుటుంబాల పట్ల సానుభూతిని ప్రకటిస్తూ స్టేడియంలో 11 సీట్లను శాశ్వతంగా వారికి కేటాయించిన వేళ, చిన్నస్వామి స్టేడియం క్రీడాస్ఫూర్తికి నిలువుటద్దంగా నిలిచింది. ఈ భావోద్వేగాల మధ్య టాస్ గెలిచిన ఆర్సీబీ సారథి రజత్ పాటిదార్ తొలుత బౌలింగ్ ఎంచుకోగా, సన్‌రైజర్స్ బ్యాటర్లు పరుగుల వరద పారించినప్పటికీ, చివరకు ఆర్సీబీ బ్యాటర్ల వీరవిహారం ముందు హైదరాబాద్ తలవంచక తప్పలేదు.

తొలుత బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 201 పరుగుల భారీ స్కోరు సాధించింది. కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన తొలి మ్యాచ్‌లోనే ఇషాన్ కిషన్ రికార్డు సృష్టించాడు. సన్‌రైజర్స్ చరిత్రలో రెండో అతి పిన్న వయస్కుడైన సారథిగా బరిలోకి దిగిన ఇషాన్, 80 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడి జట్టుకు వెన్నెముకగా నిలిచాడు. ఇన్నింగ్స్ ప్రారంభంలో అభిషేక్ శర్మ (8), ట్రావిస్ హెడ్ (11) త్వరగానే పెవిలియన్ చేరినప్పటికీ, ఇషాన్ కిషన్ మరియు హెన్రిచ్ క్లాసెన్ (31) మధ్య కుదిరిన 97 పరుగుల భాగస్వామ్యం ఆరెంజ్ ఆర్మీని కోలుకునేలా చేసింది. ముఖ్యంగా కృనాల్ పాండ్య వేసిన 13వ ఓవర్లో ఇషాన్, క్లాసెన్ కలిసి మూడు సిక్సర్లతో 21 పరుగులు రాబట్టడం మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. చివర్లో అనికేత్ వర్మ కేవలం 18 బంతుల్లోనే 43 పరుగులతో విరుచుకుపడటంతో హైదరాబాద్ స్కోరు రెండొందల మార్కును దాటింది. ఆర్సీబీ బౌలర్లలో జాకబ్ డఫీ, రొమారియో షెపర్డ్ చెరో మూడు వికెట్లతో రాణించగా, భువనేశ్వర్ కుమార్, అభినందన్, సుయాశ్ శర్మ తలో వికెట్ దక్కించుకుని ప్రత్యర్థిని కట్టడి చేసే ప్రయత్నం చేశారు.

202 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఆరంభంలోనే ఫిల్ సాల్ట్ (8) వికెట్‌ను కోల్పోయి స్వల్ప ఇబ్బందుల్లో పడింది. అయితే ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన దేవదత్ పడిక్కల్ తన పాత జట్టుపై కనికరం లేకుండా విరుచుకుపడ్డాడు. కేవలం 21 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసిన పడిక్కల్, విరాట్ కోహ్లీతో కలిసి రెండో వికెట్‌కు 45 బంతుల్లోనే 101 పరుగుల మెరుపు భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. పవర్ ప్లే ముగిసేసరికి ఆర్సీబీ 76 పరుగులు చేసి విజయం దిశగా దూసుకెళ్లింది. పడిక్కల్ 61 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఔటైనప్పటికీ, మరోవైపు విరాట్ కోహ్లీ క్లాసిక్ ఇన్నింగ్స్‌తో అలరించాడు. తన ట్రేడ్ మార్క్ షాట్లతో 33 బంతుల్లోనే అర్ధశతకాన్ని అందుకున్న కోహ్లీ, 69 పరుగులతో జట్టు విజయాన్ని ఖాయం చేశాడు. తొమ్మిదో ఓవర్లోనే జట్టు స్కోరు 100 దాటడం బెంగళూరు బ్యాటర్ల దూకుడుకు నిదర్శనంగా నిలిచింది.

మధ్యలో రజత్ పాటిదార్ (31), జితేశ్ శర్మలను డేవిడ్ పెయినే వరుస బంతుల్లో అవుట్ చేసి ఆర్సీబీని కొంత ఒత్తిడిలోకి నెట్టినప్పటికీ, టిమ్ డేవిడ్ (16 నాటౌట్) ఫోర్లు, సిక్సర్లతో మ్యాచ్‌ను ఫినిష్ చేశాడు. ఆర్సీబీ కేవలం 15.4 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి 203 పరుగులు చేసి 6 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. సన్‌రైజర్స్ బౌలర్లలో డేవిడ్ పెయినే రెండు వికెట్లు తీయగా, ఉనాద్కత్, హర్ష్ దూబే చెరో వికెట్ దక్కించుకున్నారు. పరుగుల వరద పారిన ఈ మ్యాచ్‌లో బ్యాటర్ల ఆధిపత్యమే ఎక్కువగా కనిపించినప్పటికీ, ఆర్సీబీ బౌలర్లు కీలక సమయంలో వికెట్లు తీయడం జట్టుకు కలిసి వచ్చింది. 2026 సీజన్ తొలి మ్యాచ్‌లోనే భారీ లక్ష్యాన్ని ఛేదించి ఆర్సీబీ తన టైటిల్ వేటను ఘనంగా ప్రారంభించగా, చిన్నస్వామి స్టేడియం చారిత్రక విజయానికి సాక్షిగా నిలిచింది.

## వైభవంగా సీతారామచంద్ర వారి పట్టాభిషేకం



**భద్రాచలం మహా :** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేక మహోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ పవిత్ర కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల తన సతీమణితో కలిసి హాజరై స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారి రాకతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడుతూ మరింత ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పట్టాభిషేక మహోత్సవం సందర్భంగా ఆలయంలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణలు చేసి, సంప్రదాయబద్ధంగా పట్టాభిషేక కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకను తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.ఈ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశం ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం దేవస్థానం అధికారులు గవర్నర్ దంపతులను సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. పట్టాభిషేక మహోత్సవం సందర్భంగా భద్రాచలం పట్టణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం, పోలీస్ శాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాయి.

## ఉద్యోగుల ప్రధాన సమస్యలను పరిష్కరించాల్సిందే ...

### సింగరేణి హెడ్ ఆఫీస్ ముందు నిరసన దీక్ష.. డిమాండ్లపై జిఎం పర్సనల్ కు వినతిపత్రం





**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** సింగరేణి కొత్తగూడెం ఏరియాలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం సింగరేణి ప్రధాన కార్యాలయం ముందు కొత్తగూడెం ఏరియా ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఐఎన్టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజు, రాష్ట్ర కాంగ్రెస్ డిసిసి అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఆళ్ళ మురళి, కోనేరు సత్యనారాయణ(చిన్ని), రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు బాలశౌరి పాల్గొని మాట్లాడారు. కొత్తగూడెం ఏరియా పరిధిలో ఉన్న సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని కోరారు. సర్ ఫేస్ లో ఉన్న ఖాళీలను ముందుగా అండర్ గ్రౌండ్ లో పనిచేసే జనరల్ అసిస్టెంట్లకు ప్రాధాన్యత ఇచ్చి తద్వారా సర్ఫేస్ లో ఉన్న జనరల్ అసిస్టెంట్లతో భర్తీ చేయాలని కోరారు. పి.వి.కే అండర్ గ్రౌండ్ మైన్ నందు సర్ఫేస్ లో యాక్టింగ్ చేస్తున్న అండర్ గ్రౌండ్ ఉద్యోగులతోనే ఖాళీలను భర్తీ చేయాలని తెలిపారు. సత్తుపల్లి జె.వి.ఆర్, ఓ.సి. పి కిష్టారం ఓపెన్ కాస్ట్, జేవియర్ సి.హెచ్.పిలలో డిప్యుటేషన్ పై వెళ్లిన ఉద్యోగులను కొత్తగూడెం ఏరియా వి.కె.కోల్ మైన్స్ కు తీసుకొచ్చే విధంగా చూడాలని పేర్కొన్నారు. వి.కె కోల్ మైన్స్ లో బొగ్గు తీసే పనులను సింగరేణి పర్మినెంట్ ఉద్యోగులతోనే ఉత్పత్తి చేయించాలన్నారు. కొత్తగూడెం ఏరియాలోని మైన్స్, డిపార్ట్మెంట్స్, ఓ.సి.పిలలో అవసరమైన మ్యాన్ పవర్ ను, టెక్నీషియన్స్, ఫిటర్స్, ఎలక్ట్రిషన్స్, క్లర్క్స్ స్టాఫ్ ను, సూపర్ వైజర్ స్టాఫ్ ను ఇతర డెసిగ్నేషన్లను భర్తీ చేసే విధంగా చూడాలని సూచించారు. ఏ ఏరియా వాళ్లకి ఆ ఏరియాలోనే అప్రెంటిషిప్ ఇచ్చే విధంగా చూడాలని, డి.ఎల్.ఆర్(కాంట్రాక్ట్) కార్మికులకు సమాన పనికి సమాన వేతనం (కనీసం 26 వేల పైన) ఇచ్చే విధంగా చూడాలని వారు పేర్కొన్నారు. అనంతరం సమస్యలపై జీఎం పర్సనల్ కవిత నాయుడుకి ఐఎన్టియుసి యూనియన్ ద్వారా మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పోరేట్ వైస్ ప్రెసిడెంట్ పితాంబరరావు, చీకటి కార్తీక్, మండే వీరహనుమంతు, చింతలపూడి రాజశేఖర్, శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్లు రావిరాంబాబు, స్వప్న శంకర్, ఆకునూరి సుప్రియ, హరిహరన్, కేకే శ్రీనివాస్, ఆన్తోటి పాల్, శాంతాదేవి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఒక్కరోజు నిరసన దీక్షలో పాల్గొన్న నాయకులు అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీ బుటిక రాజేశ్వరరావు, సెంట్రల్ బ్రాంచ్ కార్యదర్శులు సకినాల సమ్మయ్య, పోశం శ్రీనివాస్, విప్లవ కుమార్, మెంగాని అశోక్, ఏం.కౌమరయ్య, ట్రెజరర్ భీముడు, రాజేశ్వర జీడుల, ఫిట్ కార్యదర్శులు చిలక రాజయ్య, ఎండి సత్తార్ పాషా, ఈ.మోహన్ రెడ్డి, డి.శంకర్ బాబు, కే.నటరాజ్, సిహెచ్ సాగర్, మల్లికార్జున్, డి.శంకర్ బాబు, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ భాను కమల్, కే.కుమార్, భరత్, వై.శంకర్, నాయకులు జల్లి కిరణ్, అజైయ్, చిరంజీవి, ఎండి సవిర్, బషీర్, నాగేశ్వరరావు కట్ట నరసింహ, ఎర్రబెల్లి ఈశ్వర్, రమేష్, బండి సాయి, గోల్కొండ నవీన్, భూక్య రవి నాయక్, బాబాద్దీన్, కొప్పుల కుమార్, ఉమర్, అశోక్ కుమారస్వామి, సేఫ్టీ కమిటీ మెంబర్స్ టెంపుల్, కమిటీ మెంబర్స్, ఇతర కమిటీ మెంబర్స్, కాంట్రాక్ట్ కార్మికులు నాయకులు సంజయ్, మోహన్, రేవంత్, విజయ్, ఓదెల శంకర్, నాయకులు, కార్యకర్తలు, డి.ఎల్.ఆర్ కార్మికులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, తదితరులు పాల్గొన్నారు.

## ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భద్రగిరి మార్ట్ ను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల చేతుల మీదుగా ప్రారంభం



**భద్రాచలం మహా :** భద్రాచలం పట్టణంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భద్రగిరి మార్ట్ ను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం స్థానిక ప్రజలు, గిరిజనుల మధ్య విశేష ఆసక్తిని రేకెత్తించింది.ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా ఇలాంటి మార్ట్‌ల ఏర్పాటు ఎంతో కీలకమని పేర్కొన్నారు. గిరిజనులు తయారు చేసే ఉత్పత్తులకు సరైన మార్కెట్ అవకాశాలు కల్పించడం ద్వారా వారి ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని తెలిపారు.భద్రగిరి మార్ట్ ద్వారా గిరిజనుల చేతి వృత్తులు, అటవీ ఉత్పత్తులు, సాంప్రదాయ వస్తువులు ఒకే చోట అందుబాటులోకి రానున్నాయి. దీంతో వినియోగదారులకు నాణ్యమైన వస్తువులు లభించడమే కాకుండా, గిరిజనులకు నేరుగా లాభం చేకూరనుంది.ఈ కార్యక్రమంలో ఐటీడీఏ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా మార్ట్‌ను సందర్శించిన గవర్నర్ అక్కడ ప్రదర్శించిన ఉత్పత్తులను పరిశీలించి గిరిజనుల ప్రతిభను ప్రశంసించారు.భద్రాచలం పట్టణంలో ఇలాంటి ఆధునిక మార్కెట్ ఏర్పాటు కావడం అభివృద్ధికి సంకేతంగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇది గిరిజనుల ఆర్థిక సాధికారతకు తోడ్పడటంతో పాటు, ప్రాంతీయ ఉత్పత్తులకు ప్రాచుర్యం తీసుకురానుంది.

## రాజీ మార్గమే రాజమార్గం

- కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ సువర్ణావకాశం
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** కోర్టుల్లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ ఒక అద్భుతమైన వేదిక అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ పేర్కొన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన కార్యక్రమంలో న్యాయమూర్తి మాట్లాడుతూ రాజీ మార్గమే రాజమార్గము అని రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవడం ద్వారా ఇరుపక్షాలు స్నేహపూర్వక వాతావరణంలో తమ కేసులను పరిష్కరించుకొనుటకు సువర్ణ అవకాశమని తెలిపారు. సివిల్ కేసులు కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు మైంటెనెన్సు కేసులు బ్యాంక్ రికవరీ మోటార్ వాహన ప్రమాద బీమా కేసులను ఇరు వర్గాలు పరస్పర అంగీకారంతో రాజీ పడాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా కేసు పరిష్కారమైతే కోర్టు ఫీజు తిరిగి చెల్లించబడుతుందని దీనివల్ల సమయం డబ్బు రెండూ ఆదా అవుతాయని వివరించారు. ఇక్కడ కేసు పరిష్కారం కావడం వల్ల ఇరు పక్షాల మధ్య శత్రుత్వం పోయి సఖ్యత పెరుగుతుందని లోక్ అదాలత్ ఇచ్చే తీర్పు సివిల్ కోర్టు డిక్రీతో సమానమని దీనిపై మళ్ళీ అప్పీలుకు వెళ్లే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కక్షిదారులకు పులిహోర మంచినీళ్లు సదుపాయాన్ని ఎస్బిఐ బ్యాంక్ వారి సౌజన్యంతో కల్పించారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సరిత, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.రాజేందర్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కిరణ్ కుమార్, మెజిస్ట్రేట్స్ సుచరిత, బత్తుల రవికుమార్, వినయ్ కుమార్, సాయి శ్రీ, సీనియర్ జూనియర్ న్యాయవాదులు, పోలీస్ అధికారులు కోర్ట్ సిబ్బంది బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### మెడికల్ బోర్డు సమస్యలు పరిష్కరించాలని

## నల్ల బ్యాడ్జీలతో టిబిజికెయస్ నిరసన



**మణుగూరు, మహా :** సింగరేణి సంస్థ మెడికల్ బోర్డు సమస్యలతో పాటు కార్మికుల వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ టిబిజికెయస్ ఆధ్వర్యంలో శనివారం సింగరేణి ఏరియాలోని గనులు, విభాగాల వద్ద కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయా గనుల హెచ్ఓడీలకు వినతిపత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా టిబిజికెయస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి మాట్లాడుతూ, మెడికల్ బోర్డు రద్దు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. కార్మికులు ఐక్యంగా ఉండి వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. టిబిజికెయస్ గౌరవ అధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్ దిశానిర్దేశం, రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ పిలుపుతో ఈ నిరసన చేపట్టినట్లు తెలిపారు. మెడికల్ బోర్డు నిర్వహణ, జూలై, నవంబర్ నెలల్లో అర్హత ఉన్నప్పటికీ అన్‌ఫిట్ చేయని కార్మికులకు మళ్లీ మెడికల్ బోర్డు అవకాశం కల్పించడం, విజిలెన్స్, మారుపేర్ల సమస్యల పరిష్కారం, ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ ఎన్నికల హామీల అమలు వంటి పలు డిమాండ్ల సాధన కోసం టిబిజికెయస్ దశల వారీగా ఆందోళనలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం, కాంగ్రెస్ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు. ఈ నెల 30న సింగరేణి వ్యాప్తంగా జీఎం కార్యాలయాల ముందు నిరసనలు నిర్వహించనున్నట్లు, సోమవారం మణుగూరు ఏరియా జీఎం కార్యాలయం ముందు జరిగే ధర్నాలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బంగారి పవన్ కుమార్, మునిగేల నాగేశ్వరరావు, సుద్దాల సంపత్ కుమార్, మురళీకృష్ణ, జంగం రాజ్ కుమార్, సాంబార్ రాజశేఖర్, దిశెట్టి రమేష్, పి.కె. నాగరాజు, కమటం పరమేష్, బొద్దుల ప్రవీణ్, గూగులోత్ రమేష్ నాయక్, వినయ్ కుమార్, చిరుత వెంకటేశ్వర్లు, పద్దం శ్రీనివాస్, వర్క్‌షాప్ రెడ్డి, మస్తాన్, పీక శంకర్, కటారి ప్రసాద్, సర్వే నరేష్, ఇమ్రాన్, జ్యోతి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో వేతనాలు చెల్లించాలి..

### రైల్వే సైడింగ్ కార్మికుల నిరసన



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ఏరియా సింగరేణి రైల్వే సైడింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కార్మికులు శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. మణుగూరు ఏరియాలోని రైల్వే సైడింగ్ కార్మికులకు ఫిబ్రవరి నెల వేతనాలు ఈ నెలాఖరు దాటినా ఇంకా బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు యస్ డి నాసర్ పాషా మాట్లాడుతూ.., సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ప్రతినెల 7వ తేదీ లోపలే వేతనాలు చెల్లించాలని ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నప్పటికీ కొంతమంది కాంట్రాక్టర్లు అమలు చేయడం లేదని విమర్శించారు. కోల్ బెల్ట్ ప్రాంతంలో కార్మిక కుటుంబాల ఆర్థిక వ్యవహారాలు 3వ తేదీ నుంచి 10వ తేదీ మధ్య ఎక్కువగా జరిగే నేపథ్యంలో వేతనాల ఆలస్యం తీవ్ర ఇబ్బందులకు దారితీస్తోందన్నారు.వేతనాలు సమయానికి చెల్లించని కాంట్రాక్టర్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటారనే విషయంపై స్పష్టత లేకపోవడం వల్లే ఆదేశాలు అమలులోకి రావడం లేదని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా ఏరియా యాజమాన్యం స్పందించి రైల్వే సైడింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కుంటా రవి, జి నాగేశ్వరరావు, కె వీర్రాజు, ఎం సాంబశివరావు, కె నాగేశ్వరరావు, ఎం భావ్ సింగ్, రామకృష్ణ, రజబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్స్ రద్దు చేయాలని మార్చి 30న కొత్తగూడెంలో నిరసన

### విజయవంతం చేయాలని టీయూసీఐ పిలుపు



**మణుగూరు, మహా :** కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని, వాటిని వ్యతిరేకిస్తూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా అధ్యక్షుడు ఆర్ మధుసూదన్ రెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. టీయూసీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మార్చి 30న కొత్తగూడెంలో జరగనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు.శనివారం మణుగూరు ఏరియాలోని కార్మికులను కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ, గత తరాల కార్మికులు పోరాడి సాధించిన 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కార్మికుల శ్రమను చౌకగా దోచుకునే ఉద్దేశంతో లేబర్ కోడ్స్‌ను తీసుకువచ్చారని ఆరోపించారు. ఇవి కార్మికులను కట్టుబానిసలుగా మార్చే విధానాలని తీవ్రంగా విమర్శించారు. లేబర్ కోడ్స్ రద్దు కోసం, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం చికాగో అమరవీరుల పోరాట స్ఫూర్తితో కార్మిక వర్గం ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మార్చి 30న కొత్తగూడెంలో నిర్వహించే నిరసన కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## పండిట్ దిన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్



**జూలూరుపాడు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ అభియాన్ 2026 కార్యక్రమాన్ని మండల పార్టీ అధ్యక్షుడు భూక్య రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్, రవి రాథోడ్, కొణతం లక్ష్మీనారాయణ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పార్టీ కార్యకర్తలకు నాయకత్వ నైపుణ్యాలు, సంస్థ నిర్మాణం, పార్టీ చరిత్ర, వికాసం, సోషల్ మీడియా వినియోగం, బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నిమ్మటూరి రామారావు, ఉపాధ్యక్షుడు బాలకిషన్, యువమోర్చ అధ్యక్షుడు రాంబాబు, కార్యదర్శి బాబులాల్, సోషల్ మీడియా కన్వీనర్ చరణ్, తెల్లం నరసింహారావు, నవీన్, గోపాలరావు, ఉమ మహేశ్వరి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఉద్యోగుల టెర్మినల్ బెనిఫిట్స్ సకాలంలో చెల్లించాలి

### సింగరేణి జిఎం పర్సనల్ వెల్ఫేర్ కిరణ్ కుమార్



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** సింగరేణి ఉద్యోగులకు సంబంధించిన టెర్మినల్ బెనిఫిట్స్ చెల్లింపులను సకాలంలో పూర్తి చేయాలని జీఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జివి.కిరణ్ కుమార్ సూచించారు. శనివారం సింగరేణి ప్రధాన కార్యాలయంలోని జీఎం(పర్సనల్) వెల్ఫేర్ ఛాంబర్ నుండి జనరల్ మేనేజర్(పర్సనల్) వెల్ఫేర్ సిఎస్ఆర్ జివి. కిరణ్ కుమార్ అన్ని ఏరియాల పర్సనల్ డిపార్ట్మెంట్ అధిపతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఏరియాల వారీగా పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులతో కారుణ్య నియమకాలు టెర్మినల్ బెనిఫిట్స్ చెల్లింపుల ప్రక్రియల గురించి సమీక్షించి ఉద్యోగులకు సంబంధించిన టెర్మినల్ బెనిఫిట్స్ చెల్లింపులను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన అంశాలలో ఎటువంటి జాప్యం చేయకుండా నిబంధనలను సరించి త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమములో డిజిఎం(పర్సనల్) లు కేసా నారాయణరావు, ముకుంద సత్యానారాయణ, సీనియర్ పిఓ ఎం.శ్రీనివాస్, కమ్యూనికేషన్ ఆఫీసర్ ఎన్.సుజ్ఞాన్, వెల్ఫేర్ పిఎ కే.వరప్రసాదరావు అన్ని ఏరియాల పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

## సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు పనివేళలను మార్చాలి

- ఎండ తీవ్రతకు గురికాకుండా రక్షణ చర్యలు చేపట్టాలి
- సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం నేత
- భూక్య రమేష్ డిమాండ్



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** సింగరేణిలో పనిచేస్తున్న వివిధ కాంట్రాక్ట్ కార్మికులకు తీవ్ర ఎండల నేపథ్యంలో పని వేళలను మార్చాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు భూక్యా రమేష్ సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శనివారం సింగరేణి కాంట్రాక్టు కార్మికుల పని ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు మజ్జిగ ఓ ఆర్ ఎస్ ప్యాకెట్స్ బెల్లం పల్లి ఉండలను సప్లై చేయాలని రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. గత కొన్ని రోజుల నుండి ఎండలు తీవ్రంగా పెరగడంతో కాంట్రాక్ట్ కార్మికులు మిట్ట మధ్యాహ్నం రోడ్లపై పనులు చేస్తూ తీవ్ర అస్వస్థకు గురవుతున్నారని దీంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సింగరేణి యాజమాన్యం దీనిపై స్పందించాలని రక్షణ చర్యలతో పాటు పనివేళ్లలో ప్రతి సంవత్సరం లాగా మార్పులు చేసి విధులకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం సిఐటియు నాయకులు మాతంగి రాజేష్, గిద్ద శ్యాం కుమార్, గూగులోత్ సక్రాం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# డెవలప్‌మెంట్ + డివోషన్ = రేవంత్ కొత్త రాజకీయ ఫార్ములా

**మూసీ తీరాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరికొత్త రాజకీయఫార్ములాకు తెరతీశారు. రాజకీయ రగడల మధ్య ఆధ్యాత్మిక శంఖం మోగించి ప్రత్యర్థులకు షాకిచ్చారు. మూసీకి ముకుతాడు వేయాలంటే... మంత్రబలం కావాలా? వ్యతిరేక స్వరాలకు సమాధానం... ఆధ్యాత్మిక శక్తుల బలం కూడా ఉండాలని సీఎం భావిస్తున్నట్లు కనబడుతోంది. మేడారం నుంచి భద్రాచలం వరకు, వేములవాడ నుంచి ఓంకారేశ్వరంవరకు... దేవాలయాల రూపంలో సరికొత్త రాజకీయ రేఖలు గీస్తున్నారా? సెంటిమెంట్ ఒక ఆయుధమైతే... వ్యూహం ఒక యుద్ధరంగమైతే...తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయం ముఖ్యమంత్రి ప్రారంభించినట్లు కనబడుతోంది. 2029 లక్ష్యంగా సీఎం రేవంత్ సరికొత్త ఫార్ములాకు పదునుపెట్టి ప్రత్యర్థులు ఊహించని ఎత్తులు వేస్తున్నట్టు కనబడుతోంది. ఐదురాష్ట్రాల ఎన్నికల తర్వాత తన టీమ్ లోనూ ముఖ్యమంత్రి మార్పులుచేర్పులు చేసుకోవడం ఖాయమన్న సంకేతాలు కనబడుతున్నాయి,. మరోవైపు... కవిత రాజకీయ కదలికలు...కొత్త పార్టీ సమీకరణలు చిరుగాలిలా ఉంటాయా.. తుఫాన్ లా ప్రకంపనలు కలిగిస్తాయా? ఏప్రిల్ ఆఖర్లో స్పష్టమవుతుంది.**

**- తాజా రాజకీయపరిణామాలపై ఏఎన్ఎన్- మహా పత్రిక సీఈవో కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**



తెలంగాణ రాజకీయ యవనికపై ఒక విలక్షణమైన మార్పు సరికొత్త వ్యూహం కనబడుతోంది. కేవలం రోడ్లు, భవనాల అభివృద్ధి మాత్రమే కాదు.. కేవలం సంక్షేమ పథకాల పంపిణీ మాత్రమే కాదు.. ప్రజల 'మనసు'ను, 'మతం'ను, 'మమకారం'ను ఏకం చేసే ఒక వ్యూహాత్మక పథం దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడుగులు పడుతున్నాయి. అదే.. "డెవలప్‌మెంట్ + డివోషన్" ఫార్ములా. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత ప్రతిష్ఠాత్మకగా తీసుకున్న మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ గాంధీసరోవర్ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్. ప్రతిపక్షాల విమర్శలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నప్పటికీ.. "తగ్గేదే లే" అన్న చందంగా సీఎం దూసుకుపోతున్నారు. 3వేల ఎకరాలు, లక్షన్నర కోట్లు, పదివేల ఇళ్ళకూల్చివేతలు అంటూ ప్రతిపక్షాలు విమర్శలుచేస్తున్నా.. ఓవైపు వీటిని ఎదుర్కొంటూనే సంకల్పబలానికి దైవబలం కూడా తోడుండాలని సీఎం డిసైడ్ అయినట్లు కనబడుతోంది. రూ .700కోట్లతో ఓంకారక్షేత్ర నిర్మాణానికి పూనుకోవడం పెద్ద సంచలన వ్యూహమే.

ఇది కేవలం ఒక నదిని శుభ్రం చేసే సివిల్ వర్క్ కాదు. హైదరాబాద్ నగరానికున్న చారిత్రక వైభవాన్ని తిరిగి తీసుకురావడం ద్వారా, తద్వారా తన మార్క్ పాలనను శాశ్వతం చేయాలనేది ఆయన సంకల్పం. ఒక రకంగా చెప్పాలంటే, మూసీ ప్రాజెక్ట్ అనేది రేవంత్ రెడ్డి రాజకీయ దార్శనికతకు ఒక లిట్మస్ టెస్ట్

### ఆధ్యాత్మిక అస్త్రం:
### ఓంకారేశ్వరాలయంతో కొత్త శకం

రాజకీయాల్లో ప్రజాబలంతో పాటు దైవబలం కూడా తోడవ్వాలనేది జగమెరిగిన సత్యం. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై హిందూ వ్యతిరేక" ముద్ర పడకుండా ఉండేందుకు సీఎం అత్యంత చాకచక్యంగా వ్యవహరిస్తున్నారు. ఓంకారేశ్వరాలయం సృష్టికి మూలమైన ఓంకార నాదంతో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం ద్వారా తన పాలనకు ఒక నైతిక మరియు ఆధ్యాత్మిక పునాదిని నిర్మించుకుంటున్నారు. మేడారం సమ్మక్కసారలమ్మ (ఆదివాసీ సెంటిమెంట్), వేములవాడ రాజన్న (శైవ తత్వం), భద్రాద్రి రామయ్య (వైష్ణవ సంప్రదాయం).. ఇలా రాష్ట్రంలోని ప్రధాన ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి పెద్దపీట వేయడం ద్వారా అన్ని వర్గాల భక్తుల హృదయాలను గెలుచుకునే ప్రయత్నం చేస్తున్నారు.

### సెంటిమెంట్ పాలిటిక్స్

గణాంకాలు మరియు జిడిపి వృద్ధి రేట్లు మేధావులను ఆకర్షిస్తాయి, కానీ సామాన్య ఓటరును కదిలించేది సెంటిమెంట్. ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు సరిగ్గా అదే నాడిని పట్టుకుంది. తెలంగాణ అస్తిత్వానికి, భాషకు, యాసకు పెద్ద పీట వేయడం ద్వారా తెలంగాణ సెంటిమెంట్ ను కాపాడడం ఓ ఎత్తయితే, పండుగలు, జాతరలను ప్రభుత్వమే వైభవంగా నిర్వహించడం ద్వారా ప్రజలతో మమేకమవ్వడం చారిత్రక వారసత్వాన్ని కాపాడడం మరో ఎత్తు. వీటిని మించి ఇపుడు ఆధ్యాత్మిక అస్త్రం రెడీ చేసుకుంది. అభివృద్ధి ఆలోచనను రేకెత్తిస్తే.. ఆధ్యాత్మికత మరియు సెంటిమెంట్ అనుబంధాన్ని పెంచుతాయి. ఈ రెండింటి కలయికే రేవంత్ రెడ్డి మార్క్ హైబ్రిడ్ పాలిటిక్స్.

### సరికొత్త టీమ్

సీఎం వేగానికి తగ్గట్టుగా అధికార యంత్రాంగం మరియు కేబినెట్ సహచరులు పరుగులు తీస్తున్నారా? అనే సందేహం రాజకీయ విశ్లేషకుల్లో ఉంది. పార్టీ హైకమాండ్ సర్వేల్లోనూ పలువురు మంత్రులకు అత్తెసరు మార్కులొచ్చాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత తెలంగాణ ప్రభుత్వంలో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. కేబినెట్ ప్రక్షాళనతో పాటు పనితీరు ఆధారంగా మంత్రుల శాఖల మార్పు జరగనుంది. కీలక పోస్టుల్లో తన నమ్మకస్తులైన అధికారులను నియమించుకోవడం ద్వారా పాలనలో మరింత పట్టు సాధించాలని భావిస్తున్నారు. 2029లో గెలుపే లక్ష్యంగా సీఎం టీమ్ పై కసరత్తు చేస్తున్నట్లు కనబడుతోంది.

### కవిత ఫ్యాక్టర్:
### మారుతున్న రాజకీయ సమీకరణాలు

మరోవైపు, బీఆర్ఎస్ నేత కవిత రాజకీయంగా మళ్లీ క్రియాశీలం కావడం పొలిటికల్ ఈక్వేషన్స్ ను ప్రభావితం చేయనుంది. ఇది మహిళా ఓటు బ్యాంక్‌పై ఎలాంటి ప్రభావం చూపుతుంది? ప్రతిపక్షానికి ఇది ఎంతవరకు ఊపిరి పోస్తుంది? అనేది భవిష్యత్ నిర్ణయించనుంది. ఏప్రిల్ 25న పార్టీని ప్రారంభించనున్న కవిత ఇందూరువేదికగా దీనిపై స్పష్టత ఇచ్చారు. పార్టీ పెట్టడమంటే పాన్ డబ్బా పెట్టుడుకాదని గతంలో కేసీఆర్ వ్యాఖ్యానించారు. కవిత పట్టుదలతో వీటిని పటాపంచలు చేస్తుందా లేదా అనేది కాలమే సమాధానం చెబుతుంది.

> రాజకీయాల్లో రాణించాలంటే ప్రజాబలంతో పాటు దైవబలం కూడా తోడవ్వాలనేది జగమెరిగిన సత్యం. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై హిందూ వ్యతిరేక" ముద్ర పడకుండా ఉండేందుకు సీఎం అత్యంత చాకచక్యంగా వ్యవహరిస్తున్నారు. ఓంకారేశ్వరాలయం సృష్టికి మూలమైన ఓంకార నాదంతో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం ద్వారా తన పాలనకు ఒక నైతిక మరియు ఆధ్యాత్మిక పునాదిని నిర్మించుకుంటున్నారు.

> గణాంకాలు మరియు జిడిపి వృద్ధి రేట్లు మేధావులను ఆకర్షిస్తాయి, కానీ సామాన్య ఓటరును కదిలించేది సెంటిమెంట్. ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు సరిగ్గా అదే నాడిని పట్టుకుంది. అభివృద్ధి ఆలోచనను రేకెత్తిస్తే.. ఆధ్యాత్మికత .సెంటిమెంట్ అనుబంధాన్ని పెంచుతాయి. ఈ రెండింటి కలయికే రేవంత్ రెడ్డి మార్క్ హైబ్రిడ్ పాలిటిక్స్.

> ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత తెలంగాణ ప్రభుత్వంలో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. కేబినెట్ ప్రక్షాళనతో పాటు పనితీరు, వచ్చే ఎన్నికల అవసరాల ఆధారంగా మంత్రుల శాఖల మార్పు జరగనుంది. కీలక పోస్టుల్లో తన నమ్మకస్తులైన అధికారులను నియమించుకోవడం ద్వారా పాలనలో మరింత పట్టు సాధించాలని భావిస్తున్నారు. 2029లో గెలుపే లక్ష్యంగా సీఎం టీమ్ పై కసరత్తు చేస్తున్నట్లు కనబడుతోంది.

# చట్టబద్ధ మావోయిస్టులారా.. ఏకం కండి!

2025 అక్టోబర్ 15న మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోనూ తన 60 మంది సహచరులతో కలిసి గడ్చిరోలిలో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ ఎదుట ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతి లోకి వచ్చారు. రెండు రోజుల తర్వాత అక్టోబర్ 17న జగ్దల్‌పూర్‌లో తక్కెళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న మరో 200 మందికి పైగా వివిధ స్థాయిల కేడర్లతో అదే పని చేశారు. అప్పటి నుంచీ (అంతకుముందు కూడా ఇలాంటి లొంగుబాట్లు జరిగినా అవి జరిగిన రూపం, సారం వేరు) మావోయిస్టుల ఆయుధాల విసర్జన, పోలీసుల సమక్షంలో లొంగుబాట్ల పర్వం నిరంతరాయంగా కొనసాగుతోంది. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఎంఎంసీ(మహారాష్ట్రమధ్యప్రదేశ్‌ఛత్తీస్‌గఢ్), ఏఓబీ(ఆంధ్రాఒడిషా సరిహద్దు), తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కలిసి సుమారు మూడు వేల మంది మావోయిస్టులు చట్టబద్ధ జీవనంలోకి వచ్చారు. ఇందులో పొలిట్ బ్యూరో సభ్యులు ఇద్దరు, కేంద్రకమిటీ సభ్యులు ఐదుగురు ఉన్నారు. 20కి మించిన సంఖ్యలో రాష్ట్ర కమిటీల సభ్యులు, సుమారు వంద మంది వరకూ జిల్లా, డివిజన్ కమిటీల సభ్యులు, పలువురు కంపెనీ, ప్లాటూన్ కమాండర్లు, సీవైపీసీ, పీపీసిల సభ్యులు, ఏరియా కమిటీల కార్యదర్శులు, సభ్యులు ఉన్నారు. ఈ మూడు వేల మందిలో 50శాతం కంటే ఎక్కువ మంది మహిళలు, 98శాతం వరకూ ఆదివాసులు ఉండడం గమనార్హం.



### సాయుధ పోరాట పంథాకు కాలం చెల్లింది..

తన లొంగుబాటుకు ముందే విడుదల చేసిన పలు ప్రకటనల్లో మల్లోజుల అలియాస్ సోనూ కొన్ని విషయాలను చాలా స్పష్టంగా చెప్పారు. దేశంలో మారిన సామాజికఆర్థిక సంబంధాల మూలంగా ప్రస్తుతం దీర్ఘకాలిక సాయుధ పోరాట పంథాకు కాలం చెల్లిందని అభిప్రాయపడ్డారు. మావోయిస్టు పార్టీ ఉన్నత నాయకత్వం స్థల, కాల పరిస్థితులకు అనుగుణంగా ఆలోచించలేకపోయిందని, పిడివాద వైఖరి అవలంభించిందని చెప్పారు. తమ తప్పుడు ఆచరణ మూలంగా ప్రజలకు ప్రత్యేకించి విప్లవ శ్రేణులకు తీవ్ర నష్టం జరిగిందని వివరించారు. అందుకు తాను పశ్చాత్తాప పడుతున్నానని, బేషరతుగా క్షమాపణలు చెబుతున్నానని అన్నారు. ఇకముందు జరిగే తప్పులకు తాను బాధ్యత వహించదల్చుకోలేదని, తక్షణం పొలిట్ బ్యూరో పదవికి రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు. ఆ తర్వాత నెల రోజులకు జనజీవన స్రవంతిలోకి వచ్చారు. మల్లోజుల బాటలో ఆ తర్వాత వచ్చిన అందరు నేతలు, కేడర్ కూడా ఆయన చెప్పిన విషయాలనే వేర్వేరు రూపాల్లో, వ్యక్తీకరణల్లో తిరిగి చెప్పారు.

### తెలంగాణ లొంగుబాట్లది మరో దారి..?

కాగా, ఇతర రాష్ట్రాల్లో జరిగిన దానికి భిన్నంగా తెలంగాణలో లొంగుబాట్లు జరిగాయి. మొదటగా వచ్చిన కేంద్ర కమిటీ సభ్యురాలు పోతుల కల్పన అలియాస్ సుజాతక్క అనారోగ్య సమస్యలతో బయటకు వచ్చానని చెప్పింది. ఆ తర్వాత వచ్చిన మరో సీసీ సభ్యుడు పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న, బండి ప్రకాశ్ తాము వయసు తెచ్చిన అనారోగ్య సమస్యలతోనే లొంగిపోతున్నట్లు చెప్పారు. పరిస్థితులు మారాయని, ఇకముందు చట్టబద్ధంగా ప్రజల కోసం పనిచేస్తామన్నారు. ఆ తర్వాత వచ్చిన తెలంగాణలో లొంగిపోయిన పలువురు నేతలు ఇదే విషయాన్ని చెప్పారు. అయితే, గత నెలలో జనజీవన స్రవంతిలోకి వచ్చిన దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి మాత్రం భిన్న వైఖరి అవలంభించారు. తాము లొంగిపోలేదని, అరెస్టయ్యామని, విధిలేని పరిస్థితుల్లో అజ్ఞాత జీవితానికి స్వస్తి చెప్పాల్సివచ్చిందని ఇంటర్వ్యూల్లో వివరించారు. తాము ఇకపై చట్టబద్ధంగా పోరాడతామని వివరించారు. ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డితో జరిగిన సమావేశంలో మావోయిస్టు పార్టీపై ఉన్న నిషేధం ఎత్తివేసి, చట్టబద్ధ పార్టీగా గుర్తించాలని, తాము పీఎల్జీఏను రద్దు చేస్తామని కోరారు. అది కేంద్రం పరిధిలోని విషయం కనుక తాను హోం మంత్రి అమిత్ షాతో మాట్లాడుతానని సీఎం హామీ ఇచ్చారు.

### రెండు వర్గాలుగా చీలిక!

సోనూఆశన్న వర్గాలు లొంగిపోయిన తర్వాత మావోయిస్టు పార్టీ తరఫున అభయ్ పేరుతో ఒక ప్రకటన వచ్చింది. ఈ జనవరిలో 40 పేజీల రాతపూర్వక ఇంటర్వ్యూ సైతం వెలువడింది. వీటిలో అభయ్‌గా చెప్పుకుంటున్న నేత(బహుశా దేవ్‌జీ) సోనూఆశన్నలను పిరికిపందలుగా, ద్రోహులుగా, కోవర్టులుగా ప్రకటించారు. పార్టీకి చెప్పకుండా ఆయుధాలతో సహా లొంగిపోవడం విప్లవ ప్రతీఘాతుకత్వమేనని స్పష్టం చేశారు. దీనిపై సోనూఆశన్న వర్గాలు స్పందించలేదు. అయితే, వివిధ చానెళ్లకు ఇచ్చిన ఇంటర్వ్యూల్లో సోనూ, ఇటీవల తెలంగాణకు వచ్చిన సందర్భంలో ఆశన్న కొన్ని విషయాలను స్పష్టం చేశారు. తాము ఈ వివాదాల్లోకి పోదలచుకోలేదని, భవిష్యత్తులో తమ ఆచరణే సమాధానం చెబుతుందని క్లారిటీ ఇచ్చారు.

### విప్లవ శ్రేణులు ఏమనుకుంటున్నాయి?

ఈ లొంగుబాట్ల పర్వంపై ప్రస్తుతం తెలంగాణ సమాజం విస్మయం వ్యక్తం చేస్తున్నది. ఎంతో ఉన్నతంగా ఉన్న పార్టీ కేవలం ఏడాది కాలంలోనే ఇలా ఓటమి చెంది, అంతరించిపోతుండడం పట్ల చాలా మంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాయుధ పోరాట పంథా పనిచేయదని ఇప్పుడు వచ్చి చెబితే.. మరి ఇన్నేళ్ల బలిదానాలకు ఎవరు బాధ్యులని ప్రశ్నిస్తున్నారు. సిద్ధాంత రాజకీయం తెలిసిన వాళ్లు, మేధావులు మాత్రం ఇది తప్పనిసరి పరిస్థితుల్లో జరిగిన పరిణామంగా గుర్తించి పాజిటివ్‌గా స్పందిస్తున్నారు. కొందరు మాత్రం దేవ్‌జీరాజిరెడ్డి బయటకు వచ్చిన తీరును సమర్థిస్తుంటే, చాలామంది రెండు వర్గాలనూ ఒకేగాటన కడుతున్నారు. వాళ్లు అక్కడ ఆయుధాలిచ్చినా, రాజ్యాంగం చేబూనినా.. వీళ్లు ఇక్కడ ఆయుధాలు తేకున్నా, అరెస్టయినట్లు చెబుతున్నా, రాజ్యాంగ ప్రతి చేబూనకపోయినా ఇద్దరూ కలవడమే మంచిదంటున్నారు. "సోనూఆశన్నలు ఆయుధాలతో లొంగిపోయినా తాము భవిష్యత్తులో కొత్త వేదిక కోసం ఆలోచిస్తున్నామని, ప్రజల కోసమే పనిచేస్తామని అంటున్నారు. దేవ్‌జీరాజిరెడ్డిలు ఆయుధాలతో లొంగిపోకున్నా, ఆ తర్వాత వారి దారిలో వచ్చిన కేడర్లు భారీగా ఆయుధాలు సమర్పించారు కనుకనూ, అరెస్టని చెబుతున్నా, లొంగుబాటు వేదికపై రివార్డు చెక్కులు తీసుకున్నారు కనకనూ" ఇద్దరినీ ఒకటిగానే చూడాలంటున్నారు.

### ఏకమైతే బలమైన చట్టబద్ధ పార్టీ!

కాగా, ఫాల్స్ ప్రిస్టేజికి లోనుగాకుండా రెండు వర్గాలు కనుక ఏకమైతే దేశంలోనే బలమైన చట్టబద్ధ మావోయిస్టు కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటు చేయవచ్చునని విప్లవాభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. పార్టీల లోపల అంతర్గత పోరాటం జరిగినప్పుడు ఎలాగైతే ప్రజల మేలు కోసం ఆలోచించి నిర్ణయం తీసుకున్నారో, ఇప్పుడు కూడా ప్రజల ప్రయోజనాల ప్రాతిపదికన ఏకం కావాలని పిలుపునిస్తున్నారు. ఇరువర్గాలూ పరస్పరం ఆరోపణలు చేసుకోవడం మానేయాలంటున్నారు. ముఖ్యంగా సోనూ వర్గాన్ని ఉద్దేశించి దేవ్‌జీ వర్గం ఉపయోగిస్తున్న కోవర్ట్ పదాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతున్నారు. గత రెండేళ్లలో జనజీవన స్రవంతిలోకి వచ్చిన మూడు వేలకు పైగా మావోయిస్టులు పూనుకుంటే ఐక్య పార్టీ సాధ్యమేనంటున్నారు. గత ఐదు దశాబ్దాలుగా దేశంలో ప్రత్యేకించి ఉద్యమ ప్రాంతాల్లో మావోయిస్టు పార్టీ సహా వివిధ మార్క్సిస్టులెనినిస్టు పార్టీల్లో పనిచేస్తున్న, పనిచేసి వివిధ సందర్భాల్లో బయటకు వచ్చిన వాళ్లను కూడా కలుపుకుంటే ఈ సంఖ్య లక్ష దాటవచ్చని అంచనా వేస్తున్నారు. అప్పుడు దేశంలో బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయంగా ఒక బలమైన శక్తి ఏర్పడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. పలు దక్షిణ అమెరికా దేశాల్లో ఇలాంటి చొరవ చేసిన కమ్యూనిస్టు పార్టీలు అధికారంలోకి వచ్చిన సందర్భాలను ఉటంకిస్తున్నారు.

### ప్రస్తుత పరిస్థితుల్లో
### విప్లవాభిమానుల డిమాండ్లు ఇవే..

రెండు వర్గాలు వ్యక్తిగత నిందారోపణలతో కూడిన ప్రకటనలు, ఇంటర్వ్యూలు మానేయాలి. బయటకు వచ్చిన ఏడుగురు సీసీ సభ్యులు కలిసి సంయుక్తంగా మావోయిస్టు పార్టీ భవిష్యత్తు మీద ఒక ప్రకటన చేయాలి. లొంగిపోయి వివిధ రాష్ట్రాల పోలీసుల కంట్రోలులో ఉన్న మావోయిస్టులందరినీ మార్చి 31 తర్వాత విడుదల చేయాలని ఒత్తిడి తేవాలి.4. అందరూ జనంలోకి వచ్చిన వెంటనే వీలు చూసుకుని ఒక సెమినార్ నిర్వహించాలి. ఆ సెమినార్‌లో పాత నాయకత్వం తమ లోపాలను, తప్పులను బేషరతుగా అంగీకరించాలి.భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన రోడ్ మ్యాప్ రూపొందించాలి.

**- మంజీరా**

# మమ్మల్ని ఇట్లా బతకనివ్వండి...




నిన్న గాక మొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేటీఆర్ ను విమర్శిస్తూ భట్టరాజ కులాన్ని అతిహేయంగా కించపరిచారు. రాజకీయాలలో వాళ్లు వాళ్లు విమర్శించుకోవచ్చు. ఒకరి లోపాలు ఒకరు ఎత్తిచూపవచ్చు. అవన్నీ దైనందిన వాళ్ల రాజకీయాల్లో భాగంగా కావచ్చు. కాని ఆ క్రమంలో ఏ నాయకుడైనా ఒక కులాన్ని ఉపమానం చేసి కించపరచడం ఎంతవరకు సమంజసం? తాను బీసీ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారని బల్ల గుద్దుతుంటారు ముఖ్యమంత్రి. ప్రయోజనాల కోసం పనిచేయడం సరే... కానీ ఇలా అవహేళన చేస్తూ మాట్లాడడం కూడా ఆయన దృష్టిలో బీసీల అభ్యుదయమా?. "భట్టు రాజులు రాజుల దగ్గర పొగుడుతూ బతికారు" అని ఆయన అంటున్నప్పుడు ఆ మొహం లో భావ వ్యక్తీకరణ బాధాకరంగా ఉంది. సమాన అవకాశాలు అంటూ ఊదరగొట్టే ఈ మహా నేతలు భట్టు కులస్తులకు ఎక్కడ ఎలాంటి రాజకీయావకాశాలు కల్పించరు. కనీసం ప్రతిభను గుర్తించి నామినేటెడ్ పోస్టులు కూడా ఇవ్వరు. అయినా అలాంటివి ఆశించకుండా తమ పరిధిలో తాము గౌరవంగా బతుకుతున్న వాళ్ల మీద ఎందుకు ఆరడి?

ఒకప్పుడు గ్రామీణ తెలంగాణ సమాజానికి బడి వ్యవస్థ సరిగా లేని కాలంలో ఉపాధ్యాయులుగా నిలబడి చదువు చెప్పిన వాళ్ళు భట్టు రాజులు. కవిత్వాన్ని రెండవ కన్నుగా భావించి జీవించారు. వాళ్లు రాసిన ఎన్నో పుస్తకాలు బ్రాహ్మణుల పేరు మీద చలామణి అవుతున్నాయి అని చాలామంది చెబుతున్నారు. ఒక రామరాజభూషణుడు, ఒక కంకటి పాపారాజు, కాసుల పురుషోత్తముడు ఇప్పటివరకు అదృష్టవశాత్తు భట్టు రాజు వంశస్థులు గానే నిలిచారు. ఇటువంటి విద్యావంతులను ఉపమిస్తూ రాజకీయాలు సాగించడం, రాజకీయ భాషణాలు చేయడం ఎంతవరకు సమంజసం? ఆయన చెప్పిన వంది మాగధుల లిస్టులో ఈ కులస్తులు ఎవరున్నారు? చారిత్రక ఆధారాలు చూపించండి, ప్రభుత్వం తలుచుకుంటే చిటికెల మీద చారిత్రక పరిశోధకులు ముందు వస్తారు కదా.....

ఇప్పటికే మన మహా నాయకుల భాష సభ్య సమాజం తలవంచుకునే విధంగా తయారైంది. ఎంత పెద్ద వాళ్ళయినా అసభ్యంగా మాట్లాడడం చట్టరీత్యా నేరం. ఈ రాజకీయ నాయకులు ప్రత్యర్థులను దారుణంగా ఆరోపిస్తారు. ఆధారాలు లేని నిందలు వేస్తారు. వీళ్ళ భాష, హాస్యాస్పదంగాను, అసహ్యంగాను తయారైం ది. ఒకప్పుడు తెలంగాణ ఉద్యమంలో ఈ భాష వాడితే ప్రజల ఆమోదం లభించవచ్చు. ఉద్యమావేశం అని సరిపెట్టుకోవచ్చు. కానీ తెలంగాణ వచ్చి పదేళ్లు అయిపోయినాక కూడా ఇదే భాష వాడడం ఉపన్యాసాలను ప్రహసనాలు చేయడం ఇంకా ఎంతకాలం ? గత ప్రభుత్వం ఓడిపోవడానికి భాష కూడా ఒక ప్రధాన కారణం అని గ్రహించకపోతే రేపు అదే పరిణామాన్ని వీళ్లు కూడా అనుభవించవలసి వస్తుంది .

కాగా భట్టు రాజుల విషయానికి వస్తే ఈ నాయకులందరూఏదో సందర్భంలో హేళన చేసే వాళ్లే. అంటే సభ్య సమాజంలో ఆత్మస్థైర్యంతో భట్ట రాజులు బతకకూడదా? ఆ కులంలో పుట్టడమే వాళ్ళు చేసిన నేరమా? ఇలా వేదికలెక్కి ఏ దళితులనో మైనారిటీలనో అనగలరా? ఆ మాటకొస్తే వాళ్లు జన్మించిన కులాలకు మాత్రం ఇలాంటి అపవాదులు లేవా? ప్రతి కులానికి గ్రామీణ జీవితంలో ఏదో అపమార్గపు సామెత ఉండనే ఉంది. కానీ సమాజం నాగరికం అయ్యే కొద్దీ వాటిని క్రమంగా మరిచిపోతున్నాం. ఇలాంటి వాళ్లు మాత్రం ఈ ఒక్కటిని పట్టుకొని వేలాడుతున్నారు. "భట్టు రాజు పొగడ్త"అని అంటే నేరంగా పరిగణించాలని మన పొరుగు రాష్ట్రం ఒక జీవో తీసింది. అక్కడ భట్టు రాజుల సంక్షేమం కోసం ఒక కార్పొరేషనే ఏర్పాటు చేశారు. మన మహాత్ములు పోరాటం చేసి తెలంగాణ తెచ్చామని, ఆయన పైన ఈయన, ఈయన పైన ఆయన విజయం సాధించామని ప్రగల్బాలు పలుకుతూనే ఉన్నారు. ఆచరణలో ఏమైనా ఉందా? మేం కార్పొరేషన్లు అడగడం లేదు. మీ నుండి ఏ ప్రత్యేక గౌరవమూ కోరడం లేదు. మమ్మల్ని మీ మాటల తూటాలతోఇట్లా అవమాన పరచకండి అని చెప్తున్నాం, మా బతుకేదో మమ్మల్ని బతకనివ్వండి అంటున్నాం.

**- డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన్ రాజు,**
తెలుగు విశ్వవిద్యాలయం అధ్యాపకుడు,
9676096614

## మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సందర్శించిన ఎంపీ..

- రోగుల యోగక్షేమాలపై ఎంపీ బలరాం నాయక్ ఆరా..
- ఆసుపత్రి అభివృద్ధికి సిఎస్ఆర్ నిధులు వెచ్చించాలని ఏరియా జీఎంకు సూచన..
- ఎంపీని సన్మానించిన వైద్య సిబ్బంది.., కాంగ్రెస్ శ్రేణులు..



**మణుగూరు, మహా :** మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ శనివారం మణుగూరులోని ప్రభుత్వ వంద పడకల ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ గౌరీ ప్రసాద్, ఆప్తాలమిక్ ఆఫీసర్ సంజీవరావు, వైద్య సిబ్బంది ఎంపీకి పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వార్డులను పరిశీలించిన ఎంపీ బలరాం నాయక్ రోగుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చికిత్సా సౌకర్యాలు, సిబ్బంది అందుబాటు, మందుల సరఫరా తదితర అంశాలపై విచారణ జరిపారు.

**మౌలిక సదుపాయాలపై వినతి..**

ఆసుపత్రికి అవసరమైన మౌలిక వసతుల కల్పనపై సూపరింటెండెంట్ గౌరీ ప్రసాద్ ఎంపీకి వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా ఎమ్మార్ఐ, సిటీ స్కాన్ యంత్రాలు, మరుగుదొడ్ల నిర్మాణం, అదనపు గదులు, అంబులెన్స్ అవసరాన్ని వివరించారు.

**సింగరేణి సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధికి సూచన..**

మణుగూరు ఏరియా ఆసుపత్రి అవసరాలను తెలుసుకున్న ఎంపీ బలరాం నాయక్ సింగరేణి జీఎం దుర్గం రామచందర్ కు ఫోన్ ద్వారా సూచనలు చేశారు. ఆసుపత్రికి అవసరమైన ఎమ్మార్ఐ, సిటీ స్కాన్, మరుగుదొడ్లు, గదులు, అంబులెన్స్ వంటి సదుపాయాలను సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేయాలని కోరారు. అవసరమైతే సింగరేణి సీఎండీకి ప్రతిపాదనలు పంపాలని, తాను కూడా సిఎండి తో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

**ఎంపీకి ఘన సన్మానం..**

మణుగూరు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన సందర్భంగా ఎంపీ బలరాం నాయక్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గురిజాల గోపి, యూత్ కాంగ్రెస్ నాయకులు గురిజాల సందీప్, అక్షర మహిళా మండలి సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సాయిని వెంకటేశ్వర్లు, గురజాల గోపి, పూనెం సరోజ, రేణుక, దాకూరి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు సర్పంచులు సంఘం పరామర్శ

- 20వేల నగదు సాయం
- అగ్నిమాపక కేంద్రం మండలంలోనే ఉండాలి..
- సర్పంచుల సంఘం తీర్మానం



**మహా దుమ్ముగూడెం:** దుమ్ముగూడెం మండలంలోని రామచంద్రపురం, మహదేవపురం ,పైడాకుల మడుగు గ్రామంలో గత నెల రోజుల వ్యవధిలో వరుసగా జరిగిన అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను శనివారం 37 గ్రామ పంచాయతీలు సర్పంచులు బాధితులను పరామర్శిస్తూ ఒక్కొక్కరికి 5000 రూపాయల చొప్పున 20వేల రూపాయల నగదును వారికి అందించారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు మట్ట వెంకటేశ్వరరావు బాధితులతో మాట్లాడుతూ.. ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన కుటుంబాలను ఆదుకుంటామని రెండో విడతగా వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేపిస్తామని అన్నారు. 20 రోజులు గదులు మండలంలో మూడు అగ్ని ప్రమాదాలు కావడం దురదృష్టకరమని, మండల కేంద్రంలో అగ్ని ప్రమాదాలు తరచూ జరుగుతున్నందున అగ్నిమాపక కేంద్రాన్ని మండల కేంద్రంలో ఏర్పాటు చేసేందుకు సర్పంచులు అందరం తీర్మానం చేసి ఎమ్మెల్యే వినతిపత్రం అందిస్తామని అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేసుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచులు పాల్గొన్నారు.



### ప్రమాద బాధితులకు అరుణాచలేశ్వర ట్రస్ట్ చేయూత

**మహా దుమ్ముగూడెం:** మండల పరిధిలోని పైడాకుల మడుగు గ్రామంలో వర్ష రాముడు కు చెందిన ఇల్లు శుక్రవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది ఈ ప్రమాద ఘటన స్పందించిన నరసాపురం శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ మహా క్షేత్రం చిన్న అరుణాచలం ఆలయ వ్యవస్థాపకులు శివ నాగ స్వామి ఆలయ ట్రస్టు తరపున ఆ బాధిత కుటుంబానికి 4000 రూపాయల విలువగల నిత్యవసర వస్తువులు బియ్యం బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన కుటుంబానికి ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని ప్రభుత్వం వారికి అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుమ్ముగూడెం ఆర్ఐ నరసింహారావు అరుణ సేవా గణాలు రమాదేవి సుజాత లలిత వాణి వారి మిత్రులు కనుబుద్ది దేవా తదితరులు పాల్గొన్నారు.



### సామాజిక కార్యకర్త పాలూరి సిద్ధార్థను అభినందించిన భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్

**భద్రాచలం మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భద్రాచలం పట్టణంలో సామాజిక సేవా కార్యక్రమాలు మరింత ఉత్సాహంగా కొనసాగాయి. ఈ నేపథ్యంలో సామాజిక కార్యకర్త పాలూరి సిద్ధార్థ, జిల్లా పోలీస్ శాఖ ఉన్నతాధికారులను కలిసి టీటీడీ తీర్థప్రసాదాలు అందజేయడం విశేషంగా నిలిచింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ రోహిత్ రాజుని , అలాగే భద్రాచలం ఏఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన సిద్ధార్థ, శ్రీ వేంకటేశ్వర స్వామి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు.సామాజిక కార్యకర్త పాలూరి సిద్ధార్థ స్వస్థలం విజయనగరం జిల్లా రాజాం నియోజకవర్గంలోని వావిలవలస గ్రామం. ఆయన నిర్వహిస్తున్న "రాహుల్ సౌరబ్ నిత్య అన్నదాన సత్రం" ద్వారా అనాథలు, వృద్ధులకు నిరంతరం సేవలు అందిస్తున్నారు. ఇటీవల భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేక మహోత్సవాన్ని ప్రత్యక్షంగా వీక్షించిన ఆయన, ఆధ్యాత్మిక సేవలతో పాటు సామాజిక సేవలను కలగలిపి ముందుకు సాగుతున్నారు.ఈ సందర్భంగా ఎస్బీ సీఐ శ్రీనివాస్ రావు ద్వారా ఎస్పీ రోహిత్ రాజు తో పరిచయం ఏర్పడినట్లు సిద్ధార్థ తెలిపారు. అనాథాశ్రమంలో ఉన్న వృద్ధులు, నిరాశ్రయులకు భద్రాచలం రామయ్య దర్శనం కల్పించాలని తన కోరికను తెలియజేయగా, ఎస్పీ సానుకూలంగా స్పందించారు. వారందరికీ దర్శనం, వసతి, భోజన ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు.అదేవిధంగా డీజీపీ శివదర్ రెడ్డి కూడా ఫోన్ ద్వారా సంప్రదించి, పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు. ఈ చర్యలు తనకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయని, సేవా కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు ప్రేరణ కలిగించాయని సిద్ధార్థ పేర్కొన్నారు.పోలీస్ అధికారులు ఇద్దరూ ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని సూచిస్తూ, సిద్ధార్థను ప్రోత్సహించి ఆశీర్వదించారు. వారి సహకారం పట్ల ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.సామాజిక సేవ పట్ల అంకితభావంతో ముందుకు సాగుతున్న పాలూరి సిద్ధార్థ వంటి వ్యక్తులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఆయన చేపడుతున్న కార్యక్రమాలు మరింత విస్తరించి అనేక మందికి మేలు చేయాలని ఆకాంక్షిస్తున్నారు.

## శ్రీరామనవమి వేడుకల్లో ఐటీసీ పీఎస్‌పీడీ సేవలు

### శ్రీరామకళ్యాణం, శ్రీరామపట్టాభిషేకం రోజుల్లో పులిహోర, బట్టర్ మిల్క్,వాటర్ ప్యాకెట్లు పంపిణీ



**భద్రాచలం మహా :** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో శ్రీరామనవమి మహోత్సవాల సందర్భంగా ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్ భద్రాచలం ఆధ్వర్యంలో, భద్రాచలం మహిళా సమితి సహకారంతో భక్తులకు విస్తృత స్థాయిలో అన్నదాన సేవలు నిర్వహించారు.. శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవం రోజు నుండి పట్టాభిషేకం వరకు కొనసాగిన ఈ సేవల్లో భాగంగా గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన పేదలు, భక్తులకి, తీర్థ యాత్రికుల కోసం ప్రత్యేకంగా అన్నదాన కేంద్రాలు ఏర్పాటు చేశారు. పులిహోర, 800 కేజీ లు.బట్టర్ మిల్క్ 150,000..వాటర్ ప్యాకెట్లు. 80,000 వంటి ప్రసాదాలను భక్తులకు అందించారు. ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు నిరంతరాయంగా సేవలు కొనసాగించడం విశేషం. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ ప్రాంగణం, బస్ స్టాండ్ ప్రాంతాల్లో ప్రత్యేక పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేసి నిరంతరం సేవలు అందించారు. కళ్యాణం మరియు పట్టాభిషేకం రోజుల్లో భారీగా తరలివచ్చిన వేలాది మంది భక్తులు ఈ అన్నదాన సేవల ద్వారా లాభపడ్డారు. ఇక సారపాక ఐటీసీ పీఎస్‌పీడీ కాంపౌండ్‌లో ఏర్పాటు చేసిన గెస్ట్ హౌస్‌లు, అధికారులకు, అతిథులకు అందుబాటులో ఉంచారు. ఈ గెస్ట్ హౌస్‌లలో శుభ్రమైన గదులు, భోజన సౌకర్యాలు, 24 గంటల విద్యుత్, తాగునీటి సరఫరా వంటి అన్ని వసతులు కల్పించారు. ఈ సేవల నిర్వహణలో హెచ్.ఆర్ జనరల్ మేనేజర్ శ్యామ్ కిరణ్, హెచ్ఆర్ మేనేజర్ చెంగల్ రావు, గెస్ట్ హౌస్ ఇన్‌చార్జ్ శ్రీరామ్ రెడ్డి, మేనేజర్లు మరియు ఎంప్లాయిస్ కీలకపాత్ర పోషించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి itc సంస్థ అందిస్తున్న సేవలను ఈ కార్యక్రమం మరింత ప్రతిబింబించిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తూ అభిప్రాయపడ్డారు.

## అణచివేతకు గురవుతున్న ఆదివాసీలు

- వలసలతో ఆదివాసీల అస్తిత్వానికి ప్రమాదం
- ఓట్ల మత్తులో పాలక ప్రతిపక్షాలు
- హక్కుల కోసం ఐక్యతతో పోరాడుదాం- తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు అరుణ్‌కుమార్



**కారేపల్లి, మహా :** లంబాడీల వలసలు ఆదివాసీల అస్తిత్వాన్ని ప్రమాదంగా మారిందని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు మైత అరుణ్‌కుమార్ అన్నారు. శనివారం కారేపల్లిలో తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆదివాసీల సంఘాల తో రౌండ్ టేబుల్ సమావేశం తుడుందెబ్బ రాష్ట్ర కోశాధికారి కల్తి రాంప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో మైత అరుణ్‌కుమార్ మాట్లాడుతూ అదివాసీలు అన్ని రంగాల్లో అణచివేతకు గురికాబడుతున్నారని, అదివాసీ ప్రాంతాలలో సైతం లంబాడీల పెత్తనం సాగిస్తున్నారన్నారు. దీనికి పాలక ప్రతిపక్షాలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆరఎస్‌లు వత్తాసు పలుకుతున్నాయని ఆరోపించారు. ఎస్టీ జాబితా నుండి లంబాడీలనుతొలగించాలంటే ఆపార్టీల మద్దతు అవసరమన్నారు. ఆ పార్టీల పక్షాన ఉన్న ఆదివాసీల నాయకులు తెగించి ఎదురించాలని కోరారు. ఓట్ల మత్తులో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నారన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలనే ఈ ప్రభుత్వం చేస్తుందన్నారు. పోడు భూముల పట్టాలిస్తామనని హామీ అమలు కాలేదన్నారు. అదివాసీల పునాదులను దెబ్బతీయాలనే లక్ష్యంతో వైరి సామాజిక వర్గం పని చేస్తుందని, ఆదివాసీలకు నాణ్యమైన విద్యను అందకుండా కుట్ర జరుగుతుందన్నారు. లంబాడీ సామాజిక వర్గ నాయకులు ఆదివాసీలను రెచ్చగొట్టే వైఖరిని అవలభిస్తున్నారని, బలమైన అదివాసీ ప్రాంతాలలో సేవాలాల్, ఠాను నాయక్ విగ్రహాలను పెడుతున్నారన్నారు. దీనికి ప్రభుత్వం మద్దతు, పోలీసుల సహకారం ఇవ్వటం సహించరానిదన్నారు. అదివాసీల సహనానికి పరీక్ష పెడుతున్నారని ఇక సహించేది లేదని హెచ్చరించారు. గిరిజన ప్రాంతాలలో ఫెసా చట్టానికి వ్యతిరేకంగా గుట్టలను అక్రమంగా తవ్వుతున్నారన్నారు. ప్రభుత్వ అధికారులకు తెలిసినా పట్టించుకోవటంలేదని విమర్శించారు. చీమలపాడు ప్రాంతంలో సీతారాంప్రాజెక్టుకు భూమిలిచ్చిన నిర్వాసితుల భూములలో పంట ఫలాలను వారికే దక్కాలన్నారు. ప్రాజెక్టు పనులు జరిగేంతవరకు భూములలో ఫలసాయం రైతులకు దక్కాలన్నారు. అధికారులు అతి ఉత్సహం మంచిదికాదన్నారు. ఏజన్సీలో వనరుల పరాయికరణపై తుడుందెబ్బ పోరాటం చేస్తుందన్నారు. అదివాసీల హక్కులను కాపాడుకోవటం కోసం ఆదివాసీలు ఐక్యమై పోరాడుదామని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో తుడుందెబ్బ జాతీయ అధ్యక్షులు ఈసం సుధాకర్, ఉపాధ్యక్షులు పొదెం రాంమ్మూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్తి రాజు, అదివాసీ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాగబోయిన పాపారావు, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు బచ్చల వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం శివరాం, డివిజన్ అధ్యక్షులు ఉండం శ్రీను, జిల్లా నాయకులు ఈసాల నాగేశ్వరరావు, ఈసాల రాంబాబు, ఈసం భాస్కర్, యదలపల్లి శ్రీను, తాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.



### పదో తరగతి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్

**కారేపల్లి, మహా :** సింగరేణి మండలంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ శ్రీజ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి భయం లేకుండా ప్రశాంత వాతావరణం కల్పించాలని ఆధికారులకు సూచించారు. అనంతరం కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి, కళాశాల సమస్యలను అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. కళాశాల క్రీడా మైదానాన్ని మండల క్రీడాకారుల కోసం మినీ స్టేడియంగా అభివఅద్ధి చేయాలని అడిషనల్ కలెక్టర్ ను సింగరేణి సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ) కోరారు దీనిపై అడిషనల్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. రేలకాయలపల్లి ఆశ్రమ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ వారి అభ్యాసం, సౌకర్యాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అడిషనల్ కలెక్టర్ వెంట ఎంపీడీవో పి. శ్రీనివాసరావు, ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్, పిఆర్ ఏఈ ఎం.రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులు వృద్ధుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం..

### అర్జీలపై అధికారులు తక్షణమే స్పందించాలి కలెక్టర్ బి. చంద్రశేఖర్..



**నల్గొండ, మహా :** ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులపై జిల్లా అధికారులు సత్వరమే స్పందించి పరిష్కరించాలని కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన 'ప్రజావాణి'లో ఆయన పాల్గొని బాధితుల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి సోమవారం నిర్వహించే సాధారణ ప్రజావాణిలో రద్దీ కారణంగా వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రతి నెలా నాలుగో శనివారం ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన దివ్యాంగులు, వృద్ధులు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. పెన్షన్లు, సహాయక పరికరాలు, భూ సమస్యలపై మొత్తం 74 దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిశీలించి సంబంధిత శాఖలకు బదిలీ చేసిన కలెక్టర్ నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె. శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ నరసింహారావు నేత, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ జాగృతిలోకి భారీగా చేరికలు

- రాష్ట్రంలో రాజకీయ శూన్యతను పూరిస్తున్న కవితమ్మ నాయకత్వం
- తెలంగాణ జాగృతి పార్టీ బలోపేతమే లక్ష్యంగా రంగారెడ్డి జిల్లాలో భారీగా చేరికలు జరిగాయి



**మొయినాబాద్ మహా:** శనివారం నగరం లోని తెలంగాణ జాగృతి ప్రధాన కార్యాలయంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రూప్ సింగ్,జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కుమ్మరి శివశంకర్ ఆధ్వర్యంలో చేవెళ్ళ మరియు, కల్వకుర్తి నియోజకవర్గాలకు చెందిన వివిధ పార్టీల నుండి సుమారు 100 మందికి పైగా ముఖ్య నాయకులు, కార్యకర్తలు తెలంగాణ జాగృతిలో అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అధ్యక్షతన పార్టీలో చేరారు. తెలంగాణ జాగృతి కార్యనిర్వాహక అధ్యక్షుడు రూప్ సింగ్, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లమల్ల శ్రీకాంత్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శులు దూకుంట్ల నరేష్, వరలక్ష్మి, శ్రీనివాస్ తదితర నేతలు కొత్తగా చేరిన వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత తో పాటు జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి, జాగృతి రంగారెడ్డి జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు కుమ్మరి శివకుమార్ లు మాట్లాడుతూ రాజకీయ ప్రత్యామ్నాయం ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం ఒక కీలకమైన సంధిదశలో ఉందని, ప్రజలు ఆశిస్తున్న అభ్యుదయకరమైన నాయకత్వాన్ని అందించేందుకు కల్వకుంట్ల కవితమ్మ గారి నాయకత్వంలోని 'తెలంగాణ జాగృతి' సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఉద్యమ కాలం నుండి తెలంగాణ సంస్కృతిని, అస్తిత్వాన్ని ప్రపంచవ్యాప్తం చేయడంలో కవితమ్మ గారు పోషించిన పాత్ర అసామాన్యమైనదని, ఇప్పుడు అదే స్ఫూర్తితో ఒక బలమైన రాజకీయ ప్రత్యామ్నాయంగా ఈ పార్టీ ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. కేవలం నినాదాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పార్టీ పనిచేస్తుందని, యువత, మహిళలు, మరియు బడుగు బలహీన వర్గాలకు ఈ ప్రయాణం ఒక పెద్ద భరోసా అని ఆయన అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుత రాజకీయ గందరగోళానికి తెరదించి, ప్రగతిశీల మార్గంలో తెలంగాణ ప్రయోజనాలే పరమావధిగా అడుగులు వేయబోతున్నట్లు వెల్లడించారు. పార్టీలో చేరిన వారిలో ముఖ్యులు. సంగేరి నగేష్, పుట్నాల పరమేష్ గౌడ్, గుణాల మాధవ రెడ్డి, గౌరవ్ కుమార్, గౌరవ్ మల్లేష్, తుమ్మలూరు అంజయ్య, గోల రాజు, వీరేష్, సంజీవ రెడ్డి, నగేష్, షణ్ముఖ్ కుమార్, విశాల్, శివరామకృష్ణా రెడ్డి, కార్తీక్ రెడ్డి, ఆనంద్, తదితర ముఖ్య నేతలు ఉన్నారు.



### తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లు

**కారేపల్లి, మహా :** సింగరేణి మండల తహసీల్దార్‌గా ఓరుగంటి వెంకటేశ్వర్లు శనివారం బాధ్యతలు చేపట్టారు. నేలకొండపల్లి తహసీల్దార్‌గా పని చేస్తున్న ఆయనను డిప్యూటేషన్‌పై సింగరేణి మండల తహసీల్దార్‌గా నియమితులైనారు. సింగరేణి తహసీల్దార్‌గా పని చేసిన అనంతుల రమేష్ పూర్వ స్థానమైన కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటీవ్ అధికారిగా బదిలీ అయ్యారు. సింగరేణి మండల తహసీల్దార్‌గా నియమితులైన ఓరుగంటి వెంకటేశ్వర్లును, బదిలీపై వెళ్తున్న అనంతుల రమేష్‌లను సింగరేణి ఎంపీడీవో పీ.శ్రీనివాసరావు, ఎంపీడీవో కార్యాలయ సూపర్నిటెండెంట్ రమేష్‌లు శాలవతో సన్మానించారు.



### కుమారుడితో కలిసి గోదావరి నదిలో దూకిన మహిళ

**తల్లీ,కొడుకు లను కాపాడిన స్థానిక యువకులు మరియు డిడిఆర్ఎఫ్ బృందం**

**భద్రాచలం మహా :** పాల్వంచ మంచికంటి నగర్ కు చెందిన స్వరూప అనే మహిళ కుటుంబ కలహాలతో శనివారం మధ్యాహ్నం సమయంలో తన రెండేళ్ల కుమారుడితో ఆత్మహత్య చేసుకోవడానికి భద్రాచలం బ్రిడ్జి పై నుండి గోదావరి నదిలో దూకింది. అదే సమయంలో అక్కడ ఉన్న బోటు నడిపే వ్యక్తి ప్రసాద్,చేపలు పట్టడానికి వెళ్ళిన ఇద్దరు యువకులు,డిడిఆర్ఎఫ్ బృందం మహిళ గోదావరి నదిలో దూకడాన్ని గమనించి వెంటనే స్పందించి అట్టి మహిళను,ఆమె రెండేళ్ల కుమారుడిని కాపాడారు. వెంటనే అంబులెన్స్ లో ఇరువురిని భద్రాచలం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.వైద్యులు వారిరువురికి చికిత్సను అందించి ప్రాణాపాయస్థితి నుంచి కాపాడటం జరిగింది.తక్షణమే స్పందించి తల్లీ,కొడుకు ప్రాణాలను కాపాడిన బోటు ప్రసాద్,డిడిఆర్ఎఫ్ బృందం సభ్యులు మరియు ఇద్దరు స్థానిక యువకులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

## భారతీయుల శక్తిని తెలియజేసే గేయం వందేమాతరం




**మహానగర్ ప్రాముఖ్ డాక్టర్ రామకృష్ణ..**

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ జోన్ పరిధిలోని వై ఎన్ ఆర్ గార్డెన్లో వందేమాతరం 150వ వార్షికోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఏబీవీపీ శంషాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సామూహిక వందేమాతర గేయాలాపన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహానగర్ ప్రాముఖ్ డాక్టర్ రామకృష్ణ, ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ కోటి ప్రదీప్ , జిల్లా కన్వీనర్ దార పవన్ కళ్యాణ్ హాజరయ్యారు. దార పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ వందేమాతరం 150వ చారిత్రక ఘట్టానికి మనం సాక్షులుగా నిలిచాము. వందేమాతరం భారత్ కు స్వేచ్ఛావాయువుగా ఉపయోగపడింది. వందేమాతరం కేవలం రాజకీయ స్వేచ్ఛా మంత్రం కాదు. వేదకాలం నుంచి ఈ భూమి నా తల్లి, నేను భూమి పుత్రుడను అని చెబుతుంది. బంకించంద్ర ఛటర్జీ భారతీయుల శక్తిని తెలియజేసేలా ఈ గీతాన్ని రచించారన్నారు. పరాయి పాలనలో ఉన్న భారతీయుల్లో ఎన్నో ఆశలు నింపిందన్నారు. తమ పోరాటం కేవలం భూమి, అధికారం కాదు, బానిసత్వ సంకెళ్లను తెంచుకొని సంస్కృతిని పునరుజ్జీవింపజేయడానికే అన్న సందేశాన్ని ఇచ్చిందన్నారు. ఆంగ్లేయులు విభజించి పాలించే మార్గాన్ని ఎంచుకున్నారు. ఇందుకు బెంగాల్ ను ప్రయోగశాలగా మార్చారు. వారికీ తెలుసు.. బెంగాల్ శక్తి దేశానికి ప్రేరణగా నిలుస్తుందని. అందుకే ఆ రాష్ట్రాన్ని ముక్కలు చేస్తే, దేశం విడిపోతుంది దీనికి అనుగుణంగానే బెంగాల్ విభజన జరిగిందన్నారు. బ్రిటిష్ వారు చేసిన సమయంలో వందేమాతరం ఓ శిలలా ఎదురొడ్డి నిలిచిందన్నారు. ఆ నినాదమే ప్రజల్లో ప్రేరణ నింపిందన్నారు. ఇది భారత్ ను బలహీనపడకుండా.. మరింత బలోపేతం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ దార పవన్ కళ్యాణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భరత్ కుమార్, కో కన్వీనర్ మేఘన, టౌన్ జాయింట్ సెక్రటరీ సంతోష్, పవన్, వేణు చారి, చైతన్య, భరత్, పవన్, మహేష్, యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కృషితో నూతన ట్రాన్స్ఫారం ఏర్పాటు..

### నూతన ట్రాన్స్ఫారంని ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్ దుబ్బా సోనియా దర్శన్..



**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపాలిటీలోని సురంగల్ లోని 14వ వార్డులో గత కొన్నేళ్లుగా విద్యుత్ సమస్యతో నివాస ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇటీవలే మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన 14వ వార్డు కౌన్సిలర్ కర్రోల శ్రీధర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాడు. 14వ వార్డులో గత కొన్నేళ్లుగా విద్యుత్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్యను తెలుసుకున్న కౌన్సిలర్ కర్రోళ్ల శ్రీధర్ .. ఇటీవలే చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యను కలిసి సమస్యను వివరించారు. తక్షణమే నూతన ట్రాన్స్ఫారం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కాలే యాదయ్య కౌన్సిలర్ కర్రోళ్ల శ్రీధర్ కోరారు. దీంతో సానుకూలంగా స్పందించిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య వెంటనే సంబంధిత విద్యుత్ అధికారులకు నూతన ట్రాన్స్ఫారం ఏర్పాటు చేయాలని, రాతపూర్వకంగా లేఖ రాశారు. దీంతో శనివారం విద్యుత్ అధికారులు నూతన ట్రాన్స్ఫారంను ఏర్పాటు చేశారు. నూతన ట్రాన్స్ఫారం ప్రారంభోత్సవానికి మొయినాబాద్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ దుబ్బ సోనియా దర్శన్ ముఖ్య అతిథిగా హాజరై నూతన ట్రాన్స్ఫారంను ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కర్రోళ్ల శ్రీధర్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా సురంగల్‌లోని 14వ వార్డులో ప్రజలు క్వార్టర్స్ వద్ద 150 ఇళ్లు నిర్మాణం చేసుకొని నివసిస్తున్నారని, అక్కడి ప్రజలకు విద్యుత్ సమస్య తలెత్తడానికి ప్రధాన కారణం 25కేవీ విద్యుత్ ట్రాన్స్ఫారం ఉండడంతో నివాస గృహాలకు విద్యుత్ వినియోగం పెరగడంతో రోజుకు ఎన్నో సార్లు కరెంటు పోతుండడంతో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, విద్యుత్ సమస్యపై స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్యను కలిసి సమస్యను వివరించడం జరిగిందన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య కృషితోనే నూతన ట్రాన్స్ఫారం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీంతో వార్డు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ.. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, కౌన్సిలర్ కర్రోళ్ల శ్రీధర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఏఈ బానోతు హాము, లైన్మెన్ యాదయ్య, గ్రామ మాజీ వార్డు సభ్యులు ఎల్గని అంజయ్య గౌడ్, కరోళ్ల భాస్కర్, ఎల్గని అశోక్ గౌడ్, కందికొండ శ్రీకాంత్, కందికొండ మైసి, విక్రంరెడ్డి, వెంకట్ రెడ్డి, రాఘవేందర్, కర్రోళ్ల నర్సింగ్ రావు, బిక్షపతి, సోమ వెంకటేష్ యాదవ్, సోమ రమేష్ యాదవ్, జంగయ్య, ఎల్గని చిరంజీవి, ఎల్గని శ్రీకాంత్, వార్డు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



### మణుగూరు గ్రంథాలయంలో ప్రజాపాలన ప్రగతి కార్యక్రమం

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు గ్రంథాలయంలో శనివారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మణుగూరులో వైఫై కనెక్షన్ ఏర్పాటు చేసిన దూపకుట్ల అనిల్‌ను అభినందించారు. ప్రజలకు మరింత సేవలు అందించేందుకు ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముత్యాలమ్మ నగర్ సర్పంచ్ కొమరం జగదీశ్వరి, ఉప సర్పంచ్ శ్రీను నాయక్, గ్రంథాలయ సిబ్బంది గీత తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయ సభ్యత్వాలు నమోదు చేసి, పుస్తకాలను పంపిణీ చేశారు.

## మాల్ గ్రామపంచాయతీ వార్డు సభ్యురాలికి అవమానం...?

- గ్రామ కార్యదర్శి వ్యవహారమే ఇందుకు కారణమా.!
- కార్యాలయం ఎదుట నిరసన తెలిపిన వార్డు సభ్యురాలు స్వాతి




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** మాల్ గ్రామపంచాయతీ ఎదుట వార్డ్ సభ్యురాలు స్వాతి నిరసన తెలిపారు. శనివారం రంగారెడ్డి జిల్లా, మాల్ గ్రామ పంచాయతీలోని ఒకటవ వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన సందర్భంలో ఆ యొక్క కార్యక్రమానికి అదే వార్డుకు చెందిన వార్డ్ సభ్యురాలికి, పంచాయతీ కార్యదర్శి రాజు సమాచారం ఇవ్వకుండా పనులు చేపట్టడంతో కార్యదర్శి పై ఆరోపణలు చేస్తూ, ఒకటవ వార్డు సభ్యురాలు స్వాతి నల్ల రిబ్బన్తో కళ్ళకు గంతలు కట్టుకొని, కార్యదర్శి వ్యవహారం పట్ల మాల్ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట మరి కొందరితో కలిసి ఆందోళన చేస్తూ నిరసన తెలిపారు. తనకు చెందిన వార్డులో అధికారిక కార్యక్రమం చేపట్టి తనకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదంటూ, తనను అవమానపరిచేలా వ్యవహరిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి వ్యవహరించిన తీరు పట్ల పై అధికారులను కలిసి జరిగిన విషయాన్ని తెలియడం జరుగుతుందని ఆమె అన్నారు.

## వీధి కుక్కల దాడుల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



**యాదాద్రి భువనగిరి, మహా:** వీధి కుక్కల దాడులను నివారించి, ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించడమే లక్ష్యంగా అధికారులు కట్టుదిట్టంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్‌లో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్, ఎస్పీ అక్షాంశ్ యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, మున్సిపల్ కమిషనర్లు, పశుసంవర్ధక శాఖ సంబంధిత అధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వీధి కుక్కల బెడద అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కుక్కల నియంత్రణ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రభావిత ప్రాంతాల్లో కుక్కలను బంధించడం, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.కుక్కకాటు ద్వారా వ్యాపించే రేబిస్ వ్యాధిని నివారించేందుకు వీధి కుక్కలను గుర్తించి, వాటికి యాంటీ రేబిస్ టీకాలు వేయాలని స్పష్టం చేశారు. అలాగే కుక్కల జనాభాను నియంత్రించేందుకు పెద్దఎత్తున స్టెరిలైజేషన్ (జనన నియంత్రణ) ఆపరేషన్లు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా పాఠశాలలు, ఆసుపత్రులు, ఆర్టీసీ బస్టాండ్‌లు వంటి ప్రజలు అధికంగా రాకపోకలు చేసే ప్రాంతాల్లో ఉన్న కుక్కలను వెంటనే నియంత్రించాలని పేర్కొన్నారు. స్టెరిలైజేషన్ అనంతరం కుక్కలను తగిన షెల్టర్లలో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ రహదారులపై వీధి కుక్కలు మరియు ఇతర జంతువులు సంచరించడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నివారించేందుకు ప్రత్యేక పెట్రోలింగ్ బృందాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మున్సిపాలిటీలు,గ్రామపంచాయతీల పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఆసుపత్రుల వద్ద కుక్కలను గుర్తించి, వాటికి స్టెరిలైజేషన్ చర్యలు చేపట్టాలని తెలిపారు. స్టెరిలైజేషన్, రేబిస్ టీకా డ్రైవ్‌ను క్రమం తప్పకుండా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పశు సమర్థక శాఖ వైద్యులు,మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అదేవిధంగా చెత్త నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల వీధి కుక్కల సంఖ్య పెరిగే అవకాశం ఉందని మున్సిపల్ అధికారులు చెత్త సేకరణను క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు.జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ మాట్లాడుతూ, జిల్లాలో వీధి కుక్కలను గుర్తించి వాటికి స్టెరిలైజేషన్ చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా జనాభా ఎక్కువ ఉండే చోట క్రమం తప్పకుండా డ్రైవ్ నిర్వహించి కుక్కలకు స్టెరిలైజేషన్ చేయాలన్నారు.అలాగే కుక్కలు రోడ్లపై తిరగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.రోడ్ల పై తిరిగే జంతువులను, కుక్కలను తరచూ పెట్రోలింగ్ చేస్తూ గుర్తించి ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, ఆర్ అండ్ బి శాఖ అధికారి సరిత, పశుసంవర్ధక శాఖ అధికారి జానయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, జిల్లా వైద్యశాఖ అధికారి మనోహర్, జిల్లా రవాణా శాఖ అధికారి సాయి కృష్ణ, మున్సిపల్ కమిషనర్లు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్ పర్సన్ ఆకస్మిక తనిఖీ



**ఆదిలాబాద్ మహా:** పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో సానిటేషన్ కార్మికుల పాత్ర ఎంతో ఉందని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.మున్సిపల్ సానిటేషన్, వాటర్ సప్లై సిబ్బంది అటెండెన్స్ , హాజరు పట్టికలను పరిశీలించారు. రెగ్యులర్ గా విధులకు హాజరుకావాలని సూచించారు. ఎంతమంది విధుల్లో ఉన్నారు ఎంతమంది సెలవుల్లో ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. కార్మికుల కోసం ప్రతి నెల వేతనాల రూపంలో 78 లక్షల రూపాయలను చెల్లిస్తున్నామని అయితే కొందరు కార్మికులు విధులకు గైర్హాజరు అవుతున్నట్లు తన పరిశీలనలో తేలిందన్నారు. దుమ్మాలు కొట్టేవారిపట్ల తగు చర్యలు చేపడతామన్నారు. వేసవికాలం ప్రారంభమైనందున ప్రజలు నీటిని వృధా చేయకుండా మితంగా వాడుకోవాలని సూచించారు.శానిటేషన్ కార్మికులకు సంబంధించిన సబ్బులు , డిటర్జెంట్లు , నూనెలు, గ్లౌజులు , యాప్రాన్లను అతి త్వరలో కౌన్సిల్ తీర్మానం తీసుకొని అందించాలని అధికారులను ఆదేశించారు.కార్మికులకు ఏ సమస్య ఉన్న నేరుగా తనను సంప్రదించాలని తెలిపారు..

## హోటళ్లు, వ్యాపార కేంద్రాల పై సివిల్ సప్లై అధికారుల తనిఖీలు



**భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలో పలు హోటళ్లు, వ్యాపార కేంద్రాలలో సహాయ పౌరసరఫరాల అధికారి సురేశ్ రెడ్డి, పౌర సరఫరాల ఉప తహశీల్దార్లు నర్సింగ్ రావు, ఇన్స్పెక్టర్ (పౌ.స) విజయసింహ రెడ్డి, నర్సింహా రెడ్డిలు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమర్షియల్ సిలిండర్లకు బదులుగా వాడుతున్న (07) డొమెస్టిక్ సిలిండర్లను అధికారులు సీజ్ చేశారు . వ్యాపార కేంద్రాల్లో కేవలం కమర్షియల్ సిలిండర్లను మాత్రమే వాడాలని, డొమెస్టిక్ సిలిండర్లను వాడరాదని సివిల్ సప్లై అధికారులు తెలిపారు

## హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెను ప్రకారం ఆహారం అందించాలి

**విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్ అనురాగ్ జయంతి**



**యాదాద్రి భువనగిరి, మహా:** సంక్షేమ హాస్టల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.శనివారం మోత్కూర్ మండల కేంద్రంలో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. రెసిడెన్షియల్ స్కూల్ లో విద్యార్థుల వసతులు ఎలా ఉన్నాయని హాస్టల్ ను పరిశీలించారు.హాస్టల్ లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని ఎంత మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారని, టీచర్స్ అందరు ఇక్కడే ఉంటారా అని అడిగి తెలుసుకున్నారు.స్కూల్ లో మంచి నీటి సదుపాయం ఉందా అని అడిగి తెలుసుకున్నారు. టాయిలెట్స్ శుభ్రంగా ఉన్నాయా లేవా అని కలెక్టర్ స్వయంగా వెళ్లి పరిశీలించారు . ప్రతి రోజు రెగ్యులర్ గా శుభ్రం చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.చుట్టూ పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు.విద్యార్థులకి మధ్యాన్నం భోజనం మెనూ ప్రకారం ఆహారం పెడుతున్నారా అని విద్యార్థులను ఆరా తీశారు. కిచెన్ రూమ్ లోకి వెళ్లి వంట సామాగ్రి ని, స్టోర్ రూమ్ లో వంట సరుకులు,కూరగాయలు, పప్పు, ధాన్యాలు, గుడ్లు, ఆయిల్ క్వాలిటీ వాడుతున్నారా లేదా అని పరిశీలించారు. నాణ్యమైన వంట సరుకులు,తాజా కూరగాయలు మాత్రమే వాడాలన్నారు. హిమేష్ అనే విద్యార్థి తో కలెక్టర్ మాట్లడుతూ ఏ క్లాస్ చదువుతున్నావ్, బాగా చదువుతున్నావా, పెద్ద అయ్యాక ఏమి అవ్వాలనుకుంటున్నావ్ అని విద్యార్థిని అడగడం జరిగింది. మంచిగా చదువుకొని ఉన్నత స్థాయి కి చేరుకోవాలన్నారు. మీ తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కుషాయిగూడ జాతీయ లోక్ అదాలత్‌లో 81,078 కేసులు పరిష్కారం

**రూ.34.54 లక్షల పరిహారం**

**కుషాయిగూడ, మహా :** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ,న్యూఢిల్లీ మరియు తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మల్కాజిగిరి ఆధ్వర్యంలో కుషాయిగూడ జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వి. బాల భాస్కర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి సత్తు రవీందర్ మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా రాజీ పడదగిన కేసులను సులభంగా, వేగంగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 25 బెంచ్‌లలో మొత్తం 39 సివిల్ కేసులు, 81,007 క్రిమినల్ కేసులు పరిష్కరించబడినట్లు అధికారులు వెల్లడించారు. అదేవిధంగా బ్యాంకులు, బిఎస్ఎన్ఎల్‌కు సంబంధించిన 32 ప్రీలిటిగేషన్ కేసులు కూడా పరిష్కారం పొందాయి. ఈ లోక్ అదాలత్ ద్వారా మొత్తం రూ. 34,54,988 పరిహారం కింద చెల్లించబడినట్లు తెలిపారు.

## సింగరేణి సంస్థలో మెడికల్ బోర్డు నిర్వహించాలి

- అర్హత ఉండి అన్ఫిట్ చేయని కార్మికులకు తిరిగి మెడికల్ బోర్డు నిర్వహించాలి
- ప్రభుత్వం చేస్తున్న కార్మిక వ్యతిరేక చర్యలకు నిరసన సెగ



**మందమర్రి, మహా :** సింగరేణి బొగ్గు సంస్థలో మెడికల్ బోర్డు నిర్వహించాలని భారత రాష్ట్ర సమితి అనుబంధం (టీబీజీకేఎస్) మందమర్రి ఏరియా ఉపాధ్యక్షులు మేడిపల్లి సంపత్, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు జంగిలి రవీందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఓ రాజశేఖర్‌లు డిమాండ్ చేశారు. శనివారం మందమర్రి ఏరియా కే.కే5 గని పై టీబీజీకేఎస్ నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గత సంవత్సరం జూలై, నవంబర్ మాసాలలో అర్హత కలిగి అన్ఫిట్ చేయని కార్మికులకు తిరిగి మెడికల్ బోర్డు నిర్వహించాలని వారు కోరారు. సింగరేణి వ్యాప్తంగా మారుపేర్ల సమస్యను పరిష్కరించాలని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి కాలరీస్ కంపెనీలో విజిలెన్స్ దాడులు ఎక్కువయ్యాయని మండిపడ్డారు. గడిచిన సింగరేణి గుర్తింపు ఎన్నికలలో ఐ.ఎన్.టి.యు.సి, ఏ.ఐ.టీ.యూ.సీ. సంఘాలు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని హితవు పలికారు. రాష్ట్ర అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క వాక్యాలకు నిరసనగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గని పిట్ కార్యదర్శి వీరారెడ్డి, శివ కుమార్, బొడ్డు మల్లేష్, పోలు సంపత్, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ శిబిరంలో కంటి వైద్య పరీక్షలు

- లంబడితండా ప్రజల కోసం కార్యక్రమం
- ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కూడా విస్తరణ ఉపన్యాసం




**బెల్లంపల్లి,మహా:** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీకళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మండలంలోని లంబడితండా గ్రామంలో నిర్వహిస్తున్న వేసవి ప్రత్యేక శిబిరంలో భాగంగా శనివారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 ప్రోగ్రాం ఆఫీసర్లు గజెల్లి మోహన్, ఎంఎ రేష్మ ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు కంటి వైద్యులచే వైద్య పరీక్షలు నిర్వహించారు.కళ్లద్దాలు అవసరం ఉన్నవారికి,ఇతర వైద్యం అందాల్సిన వారికి తగుసలహాలు,సూచనలు చేశారు...మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి.. ఎక్సైజ్ శాఖఆధ్వర్యంలో ప్రత్యేక విస్తరణ ఉపన్యాసం నిర్వహించారు. శాఖకు సంబంధించి ప్రజలకు అవసరమైన పలు సూచనలు చేశారు. జాగ్రత్తలను వివరించారు.ముఖ్యంగా గ్రామీణ ప్రజలు మాదకద్రవ్యాలకు దూరంగాఉండాలని ఎక్సైజ్ సీఐ జె.ఇంద్రప్రసాద్, ఎస్సై ఎం.వెంకటేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ఉంటామంటూ గ్రామ ప్రజలు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లచేప్రతిజ్ఞచేయించారు...శిబిరం... రేపే చివరి రోజు..బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,2ఆధ్వర్యంలో లంబడితండా గ్రామంలో చేపట్టిన వేసవి ప్రత్యేక శిబిరం ఆరు రోజులుగా కొనసాగుతోంది. ఆదివారం శిబిరంలో చివరి రోజు అని, విద్యార్థులు, అధ్యాపకులు అందరూ భాగస్వామ్యమై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్, వైస్ ప్రిన్సిపాల్ మేడ తిరుపతి ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 ప్రోగ్రాం ఆఫీసర్లు గజెల్లి మోహన్, ఎంఎ రేష్మ, అధ్యాపకులు, డాక్టర్ కూనురాజుల సమ్మక్క, కాలోజి సునీల్ ,పైడాకుల రవి,అల్లంతిరుపతి,విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీర్ల అయిలయ్య చిత్రపటానికి పాలాభిషేకం



**ఆలేరు, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా గందమల్ల చెరువు నుండి ఆలేరు పెద్దవాగులోకి నీళ్లు వదిలి వేసవిలో రైతుల పొలాలు ఎండిపోకుండ నీరు అందిస్తున్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చిత్రపటానికి శనివారం ఆలేరు మున్సిపల్ చైర్మన్ బీజన బాలమణి భాస్కర్ ,కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలాభిషేకం చేశారు... ఆలేరు పెద్దవాగులో పారుతున్న గోదావరి జలాలకు ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు... ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఆంజనేయులు ,కౌన్సిలర్లు జూకంటి సంపత్,ఆంజనేయులు,నాయకులు సాగర్ రెడ్డి ,ఎంఎ ఏజాజ్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల అసెంబ్లీ ముట్టడి

**వలిగొండ, మహా:** తెలంగాణ ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం అసెంబ్లీ ముట్టడికి వెళ్లిన ఉద్యమకారులను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం అని అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలి అని టి యు జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ డిమాండ్ చేశారు ఉద్యమకారుల సమస్యలు వెంటనే పరిష్కరించి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన అన్నారు రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఉద్యమకారులు క్రియాశీలక పాత్ర పోషించారని ఆయన గుర్తు చేశారు ఉద్యమకారులను మోసం చేస్తే గత ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపిన వాళ్ళం నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేయడం దుర్మార్గమని ఉద్యమకారులతో గోక్కుంటే పతనం తప్పదని ఆయన హెచ్చరించారు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేసేంతవరకు టి యు జేఏసీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటుందని ఆయన అన్నారు

## శిక్షణ పొందిన మహిళలకు ధృవపత్రాల పంపిణీ



- మహిళలు స్వశక్తితో నిలబడాలంటే శిక్షణ అవసరం
- సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు శ్రీ వాణి వెల్లడి

**మందమర్రి, మహా :** మందమర్రి ఏరియా సింగరేణి కాలరీస్ కంపెనీ సేవా సమితి ద్వారా బ్యూటీషియన్ శిక్షణ పొందిన పలువురు మహిళలకు శనివారం ధృవపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక జీఎం ఎన్ రాధాకృష్ణ, సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటియూసి బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, సీఎంఓఏఐ అధ్యక్షులు రమేష్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ (సింగరేణి) సి.ఎస్.ఆర్, రీజినల్ డైరెక్టరేట్ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఎంటర్ప్రినర్షిప్ (ఆర్ డి (ఆర్.డి.ఎస్.డి.ఈ), హైదరాబాద్ఆధ్వర్యంలో ఏరియా 31 మంది మహిళ అభ్యర్థులకు కాస్మోటాలజీ కోర్సును ఇచ్చినట్లు తెలిపారు. ఇలా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు నేడు ధృవపత్రాలు అందజేస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, సింగరేణి సంస్థ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి సూచనలమేరకు స్థానిక నిరుద్యోగ మహిళలకు లబ్ధి చేకూర్చే దిశగా కంపెనీ ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. సంస్థ ఇచ్చే ఇలాంటి తోడ్పాటును ఉపయోగించుకోవాలని వారు పిలుపునిచ్చారు. మహిళలు ఇలా శిక్షణ తీసుకోవడం ద్వారా స్వయం ఉపాధితో ఆర్థిక అభివృద్ధి పొందుతారని వివరించారు. భార్యాభర్తలు ఇద్దరూ పనులు చేస్తే సంసారం ప్రశాంతంగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిఎం బి టి సి అడిషనల్ మేనేజర్ టి శ్రీధర్, అశోక్ కుమార్, అసిస్టెంట్ ట్రైనింగ్ మేనేజర్, కాస్మోటాలజీ ట్రైనర్ ప్రీతి, డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రయ్య**




**లక్షెట్టిపేట /మంచిర్యాల, మహా :** లక్షెట్టిపేట మునిసిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా కొత్తగా ఎంపికైన కౌన్సిలర్లు పనిచేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య పిలుపునిచ్చారు. శనివారం లక్షెట్టిపేట మున్సిపల్ కార్యాలయ సమావేశం మందిరంలో మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్, చైర్ పర్సన్ దొంత అంజలి, వైస్ చైర్ పర్సన్ రాజేశ్వరి లతో కలిసి బడ్జెట్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం స్థానిక సంస్థల అభివృద్ధికి బడ్జెట్ ప్రణాళికలు సమర్థవంతంగా రూపొందించి అమలు చేయాలని తెలిపారు. వివిధ అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ, త్రాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించాలని వెల్లడించారు. 202526 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్, 202627 సంవత్సరానికి గాను అంచనా బడ్జెట్ లను కౌన్సిల్ సభ్యుల ఆమోదంతో ప్రతిపాదిత మున్సిపల్ బడ్జెట్‌ను ఖరారు చేశారు. 202627 సంవత్సరానికి గాను అంచనా బడ్జెట్ 25 కోట్ల 80 లక్షల రూపాయల అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారని, ఇందులో 3 కోట్ల 42 లక్షల రూపాయలు సాధారణ ఆదాయం (గ్రాంట్లు కాకుండా), 21 కోట్ల 42 లక్షల రూపాయల గ్రాంట్లు, 90 లక్షల రూపాయల డిపాజిట్లు, అడ్వాన్సులు, 5 లక్షల 95 వేల రూపాయల నిలువ ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మున్సిపల్ పరిధిలో పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. అనంతరం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని డంప్ యార్డ్‌లో చేపడుతున్న బయో మైనింగ్ పనులను పరిశీలించారు. పాత చెత్తను శాస్త్రీయ పద్ధతులలో వేరు చేసి, పర్యావరణానికి హాని లేకుండా నిర్వహిస్తున్న విధానం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బయో మైనింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, పట్టణంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి నివారణకు విద్యార్థులకు అవగాహన



**బెల్లంపల్లి ,మహా:** బెల్లంపల్లి పట్టణంలోని తాళ్ల గురుజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తెలంగాణ గురుకుల రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ లోని విద్యార్థులకు క్షయ వ్యాధి నివారణ పట్ల అవగాహన సదస్సును శనివారం రోజుమెడికల్ ఆఫీసర్ డా.ఇవాంజలీన నిర్వహించారు..పాఠశాల కళాశాల ఆవరణలో టిబి ముక్త్ భారత్ అభియాన్ 100రోజులకార్యక్రమంలో భాగంగా నిర్వహించారు స్తానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డా.ఇవాంజలీన అక్కడ హాజరైన విద్యార్థులతో మాట్లాడారు. క్షయ వ్యాధి నివారణ కై వ్యాధి గురించి అవగాహన కల్పిస్తూ రెండు వారాలకు పైగా దగ్గు లక్షణాలు ఉంటే క్షయ వ్యాధిగా అనుమానించాలన్నారు, క్షయవ్యాధి వ్యాప్తి చెందకుండా తగినజాగ్రతలు పాటించాలని దీంట్లో భాగంగా పోస్టర్లని అవగాహన కొరకు విడుదల చేసి పాఠశాలలో ఆవిష్కరించారు.విద్యార్థులతో పాఠశాల సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లాలోని ప్రతి ఆరోగ్యకేంద్రంలో వ్యాధి నిర్ధారణ తెమడ పరీక్షలు, ఎక్స్ రే పరీక్ష ఉచితంగా చేస్తున్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ జరిగితే ఉచితంగా చికిత్స అందిస్తూ, చికిత్స పూర్తయ్యే వరకు ప్రతినెల 1000 చొప్పున పోషణ భత్యాన్ని ప్రభుత్వం అందిస్తుందని ఆమె విద్యార్థులకు తెలిపారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్నవారికి ఈ వ్యాధి తొందరగా వ్యాపిస్తుందని, అందుకు అన్నిరకాల పోషకాహారాలు దొరికే ఆహారాన్ని తీసుకోవడం ఉత్తమ మార్గం అన్నారు. సత్వరమే వ్యాధి నిర్ధారణ జరిగి చికిత్స ప్రారంభించి వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు.తుంపర్ల ద్వారా ఒకరి నుంచి ఇంకొకరికి వ్యాప్తిచెందే ఈ వ్యాధి మద్యం సేవించే వారికి పొగాకు నమిలే వారికి సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని తెలిపారు.ఈ శిబిరంలో పాఠశాల ప్రిన్సిపాల్ సత్తయ్య, స్టాఫ్ నర్సు సంగీత,డివిజన్ క్షయవ్యాధి సూపర్వైజర్ శ్రీపెల్లి శశికాంత్,క్షయవ్యాధి విజిటర్ గంగబోయిన వెంకటేశం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సూపర్వైజర్ మల్లిక, ఎఎన్ ఎమ్ చంద్రకళ తదితరులు సేవలందించారు.

# చిన్నస్వామిలో కన్నీటి నివాళి..

- గెలుపు సంబరాల్లో రాలిన '11' ప్రాణాలకు అంజలి!
- ఐపీఎల్ ఆరంభానికి ముందు భావోద్వేగ క్షణాలు
- నల్ల బ్యాండ్లతో మైదానంలోకి ఆటగాళ్లు
- మృతుల జ్ఞాపకార్థం 11 సీట్లు శాశ్వతం



**బెంగళూరు, మహా.** "మరో ఐపీఎల్ సమరానికి నగార మోగింది.. స్టేడియం మొత్తం అభిమానుల కేకలతో మార్మోగుతోంది.. కానీ, ఆ కోలాహలం వెనుక ఒక తీరని వేదన, గుండెలు పిండే జ్ఞాపకం దాగి ఉంది. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య ఐపీఎల్ 2026 సీజన్ తొలి మ్యాచ్ ప్రారంభానికి ముందు చిన్నస్వామి స్టేడియం భావోద్వేగాలకు వేదికైంది. గతేడాది ఆర్సీబీ తొలి టైటిల్ గెలుచుకున్న వేళ, ఆ విజయోత్సవాల్లో చోటుచేసుకున్న తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన 11 మంది వీరాభిమానులకు యావత్ క్రీడాలోకం కన్నీటి నివాళి అర్పించింది. ఇరు జట్ల ఆటగాళ్లు, అధికారులు మరియు వేలాది మంది అభిమానులు ఒక్క నిమిషం పాటు మౌనం పాటించి మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన దృశ్యం అందరినీ కదిలించింది." గౌరవసూచకంగా ఇరు జట్ల ఆటగాళ్లు చేతులకు నల్ల బ్యాండ్లు ధరించి మైదానంలోకి అడుగుపెట్టారు. మృతుల పట్ల తమకున్న అపారమైన గౌరవాన్ని చాటుతూ ఆర్సీబీ ఆటగాళ్లు వార్మప్ సమయంలో '11' నంబర్ ముద్రించిన ప్రత్యేక జెర్సీలను ధరించి కనిపించడం విశేషం. ఐపీఎల్ నిర్వాహకులు సైతం తమ అధికారిక 'ఎక్స్' ఖాతాలో మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ భావోద్వేగపూరిత సందేశాన్ని పోస్ట్ చేశారు. గతేడాది జూన్ 4వ తేదీన ఆర్సీబీ చారిత్రాత్మక విజయం సాధించిన తరుణంలో స్టేడియం వెలుపల జరిగిన అపశ్రుతిలో 11 మంది ప్రాణాలు కోల్పోగా, అనేకమంది గాయపడిన విషయం తెలిసిందే. ఈ విషాద ఘటన నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా చిన్నస్వామి స్టేడియంలో క్రీడా కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి విదితమే. ఈ దుర్ఘటన కారణంగా బెంగళూరు నగరం 2025 మహిళల వన్డే ప్రపంచకప్, 2026 పురుషుల టీ20 ప్రపంచకప్ వంటి మెగా టోర్నీలకు ఆతిథ్యం ఇచ్చే అవకాశాన్ని కోల్పోయింది. అయితే, వెంకటేష్ ప్రసాద్ నేతృత్వంలోని కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ (కేఎస్ సీఏ) గత ఏడాది కాలంలో స్టేడియం మౌలిక సదుపాయాల్లో విప్లవాత్మక మార్పులు చేసింది. ప్రేక్షకుల నిర్వహణ కోసం పటిష్టమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, భద్రతా ప్రమాణాలను అంతర్జాతీయ స్థాయికి పెంచింది. మరణించిన ఆ 11 మంది అభిమానుల జ్ఞాపకార్థం స్టేడియం ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద ఒక స్మారక ఫలకాన్ని ప్రతిష్ఠించారు. అంతేకాకుండా, గ్యాలరీలో 11 సీట్లను శాశ్వతంగా వారికే కేటాయిస్తూ కేఎస్ సీఏ తీసుకున్న నిర్ణయం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. చిన్నస్వామి స్టేడియం పునఃప్రారంభమైన తర్వాత జరుగుతున్న తొలి ప్రధాన మ్యాచ్ కావడంతో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. క్రీడల పట్ల అభిమానులకున్న అమితమైన ఇష్టాన్ని గౌరవిస్తూనే, వారి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఒకవైపు తమ అభిమాన జట్టు డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతుండటంతో ఉత్సాహంగా ఉన్న ఆర్సీబీ అభిమానులు, మరోవైపు గతేడాది కోల్పోయిన తమ తోటి భక్తులను స్మరించుకుంటూ భారమైన హృదయంతో మ్యాచ్‌ను వీక్షించారు. చిన్నస్వామి స్టేడియం చరిత్రలో ఈ రోజు కేవలం ఒక క్రికెట్ మ్యాచ్‌గా మాత్రమే కాకుండా, క్రీడాకారులుఅభిమానుల మధ్య ఉండే విడదీయరాని బంధానికి ప్రతీకగా మిగిలిపోనుంది.



## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

పరమేశ్వర్ రెడ్డి

**కుషాయిగూడ, మహా:** చిలకనగర్ డివిజన్ పరిధిలోని న్యూ రామ్ నగర్ కాలనీకి చెందిన రాధా రామ్ ఆరాధ్య అనారోగ్య సమస్యతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న చిలకనగర్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆకిటి ఆగం రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు మొలకలపల్లి రాజేష్ ముదిరాజ్ కలిసి అవసరమైన సహాయం కోసం ముందుకు వచ్చారు. అత్యవసర చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఎల్ఓసీ ద్వారా రూ.50,000 మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులకు ఎల్ఓసీ పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాకారం లక్ష్మణ్, ఆకిటి ఆగం రెడ్డి, మొలకలపల్లి రాజేష్ ముదిరాజ్, ఉపేందర్ రెడ్డి, గణేష్ నాయక్, కంది శ్రవణ్ రెడ్డి, బాలయ్య బాబు, కిషన్ నాయక్, విజయ్ కుమార్, గౌరిగే మహేష్, రాజన్న, నాయక్, సర్ఫరాజ్, బాకారం అరుణ్, ధర్మేందర్ నాయక్, సుమన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## ఆశా వర్కర్ల అక్రమ అరెస్టులను ఖండించాలి

- ప్రజాపాలన పేరుతో దొరల పాలనను ఎదుర్కోవాలి
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా సీఐటీయూ సహాయ కార్యదర్శి కె. ఉన్నికృష్ణన్

**కుషాయిగూడ, మహా:** ఆశా వర్కర్లు "చలో హైదరాబాద్" ధర్నాకు బయలుదేరిన సందర్భంగా కుషాయిగూడ, మల్కాజిగిరి, బాలానగర్, సూరారం, షాపూర్‌నగర్, కేసర్, జవహర్‌నగర్, షామీర్పేట్, ఉప్పల్, అల్వాల్, మేడ్చల్ ప్రాంతాల్లో పోలీసులు అక్రమంగా అరెస్టులు చేపట్టారని ఆయన తెలిపారు. కొంతమందిని అర్ధరాత్రి సమయంలో అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారని అన్నారు. ఈ విధమైన అక్రమ అరెస్టులతో ఉద్యమాలను అణగదొక్కలేరని, ప్రజా సమస్యలపై పోరాటాలు మరింత ఉధృతం అవుతాయని హెచ్చరించారు. ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఆశా వర్కర్లకు స్థిర వేతనం రూ.18,000, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పిస్తామని హామీలు ఇచ్చి, ఇప్పుడు వారినే అరెస్టు చేయించడం అన్యాయమని పేర్కొన్నారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఎం. రేవతి కళ్యాణి మాట్లాడుతూ ఆశా వర్కర్లపై జరుగుతున్న అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



## జిల్లా బార్ అసోసియేషన్ కమిటీ సభ్యులకు సన్మానం

**కుషాయిగూడ, మహా :** మల్కాజిగిరి జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపొందిన బార్ అసోసియేషన్ కమిటీ సభ్యులను శనివారం కుషాయిగూడలో అడ్వకేట్ పి.అజయ్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఆయన కార్యాలయంలో శాలువాతో సత్కరించి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.రత్నయ్య, ఉపాధ్యక్షురాలు ప్రసన్న కుమారి, ప్రధాన కార్యదర్శి ఎస్.దుర్గాప్రసాద్ యాదవ్ లు మాట్లాడుతూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోర్టులో న్యాయవాదులకు సంబంధించి చాలా సమస్యలు ఉన్నాయని వాటన్నిటినీ త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. కోర్టు సమస్యలు, కోర్టుల సముదాయ భవనం, జూనియర్ న్యాయవాదుల సమస్యలు, ప్రజలకు లీగల్ అవగాహన కలించి అందరికీ కోర్టు, కేసులు, పరిష్కారం వంటి పలు అంశాలపై సదస్సులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎం.హరికృష్ణ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ బి.ఎన్. పవన్ కుమార్ తో పాట్ పలువురు న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నా.. సాధించావ్

వివేక్ తో కేటీఆర్

**మహా:** మైనింగ్ మంత్రి వివేక్‌పై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సీరియస్ అయ్యారు. రాఘవ క్రషర్ మీద ప్రతిపక్ష బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు నిలదీయడంతో.. ఆయనకు కౌంటర్ ఇవ్వడంలో మంత్రి వివేక్ ఫెయిల్ అయ్యారని అసెంబ్లీ వ్యవహారాల మంత్రిగా ఆగ్రహించారు. హరీశ్‌రావు అన్ని ఆధారాలతో సహా రాఘవ క్రషర్ వ్యాపారాన్ని వెలుగులోకి తీసుకురాగా.. మైనింగ్ మంత్రి అయిన వివేక్ మాత్రం సరైన సమాధానం ఇవ్వడంలో వెనుకబడిపోయారు. అంతేకాకుండా.. క్రషర్ సంస్థకు మైనింగ్ అధికారులు స్వయంగా నోటీసులు జారీ చేశారని హరీశ్‌రావు వెల్లడించినా.. అసలు నోటీసుల అంశం తనకు తెలియదంటూ సభ సాక్షిగా వివేక్ చెప్పడం మిగతా మంత్రుల్లో మరింత ఆగ్రహం తెప్పించింది. ఎలాంటి వివరాలు లేకుండా మాట్లాడడంపైనే శ్రీధర్ బాబు ఆయనకు క్లాస్ తీసుకున్నారు. సభ ముగిసిన తరువాత 20 నిమిషాల పాటు బీఆర్ఎస్ సభ్యులంతా ఒక దగ్గరకు చేరి చర్చించుకున్నారు. హాలులో ఉన్న అధికారులతో వివేక్ మాట్లాడుతుండగా.. ఆయనను పిలిచి మరీ సెటైర్ వేశారు. 'వివేక్ అన్నా.. మొత్తానికి సాధించావ్' అంటూ ఆయనపై కేటీఆర్ సెటైర్ వేశారు. మైనింగ్ అక్రమాలపై సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ సీఐడీ ఎంక్వయిరీకి ఆదేశించడంతో వివేక్‌పై ఈ వ్యాఖ్య చేశారని బీఆర్ఎస్ సభ్యుడు అన్నారు.

## పత్తి గోదాంలో ఎగిసిపడిన నిప్పులు.. రూ. 60 కోట్ల మేర ఆస్తి నష్టం

**రంగారెడ్డి,మహా.** రంగారెడ్డి జిల్లా నందిగామ మండల కేంద్రంలో శనివారం భీతావహ వాతావరణం నెలకొంది. స్థానిక వీర్లపల్లి రోడ్డులో ఉన్న శ్రీ కృష్ణ రూరల్ గోదాంలో ఒక్కసారిగా భారీ అగ్నిప్రమాదం సంభవించింది. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కు చెందిన పత్తి నిల్వలు ఈ గోదాంలో ఉండటంతో, నిప్పురవ్వలు తగిలిన క్షణాల వ్యవధిలోనే మంటలు దావానలంలా వ్యాపించాయి. ఆకాశాన్ని తాకుతున్న నల్లటి పొగ మేఘాలు, దంచికొడుతున్న మంటల ధాటికి పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురై ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. పత్తి అత్యంత త్వరగా మండే స్వభావం కలిగి ఉండటంతో మంటలు అదుపుతప్పి గోదాం అంతటా విస్తరించాయి. ప్రమాద సమయంలో గోదాంలో విధుల్లో ఉన్న సిబ్బంది మంటలను గమనించి వెంటనే అప్రమత్తమయ్యారు. వారు ప్రాణభయంతో బయటకు పరుగులు తీయడంతో పాటు తక్షణమే పోలీసులకు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే షాద్‌నగర్, మహేశ్వరం తదితర ప్రాంతాల నుంచి అగ్నిమాపక యంత్రాలు యుద్ధ ప్రాతిపదికన సంఘటనా స్థలానికి చేరుకున్నాయి.



మహా పత్రిక
ANN తెలుగు
08
ఆదివారం, హైదరాబాద్ | 29-03-2026 | జిల్లా వార్తలు | DISTRICT NEWS | WWW.MAHAADAILY.COM



## ఆ సినిమా పైనే ఆశలు పెట్టుకున్న వైష్ణవి..

సోషల్ మీడియా ద్వారా క్రేజ్ తెచ్చుకున్న భామల్లో వైష్ణవి చైతన్య ఒకరు. ఈ చిన్నది సోషల్ మీడియా, యూట్యూబ్ వీడియోల ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకుంది. అంతే కాదు ఈ అమ్మడు పలు షార్ట్ ఫిలిమ్స్ లోనూ నటించి ఆకట్టుకుంది. హీరోయిన్ రేంజ్ అందంతో ఈ కుర్రది కుర్రాళ్ల గుండెల్లో బాణాలు గుచ్చింది. కెరీర్ బిగినింగ్ లో పలు సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసి మంచి మార్కులు కొట్టేసింది. ఆతర్వాత హీరోయిన్ గా మారి సినిమాలు చేస్తుంది. బేబీ సినిమాతో హీరోయిన్ గా మారింది వైష్ణవి. సాయి రాజేష్ దర్శకత్వంలో, ఆనంద్ దేవరకొండ నటించిన బేబీ సినిమా భారీ విజయాన్ని అందుకుంది. చిన్న సినిమాగా వచ్చిన ఈ మూవీ.. ఎవ్వరూ ఊహించని విధంగా సినిమా హిట్ అవ్వడంతో పాటు నటీనటులు మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. బేబీ సినిమా తర్వాత లవ్ మీ అనే సినిమా చేసింది. ఈ సినిమాడిజాస్టర్ అయ్యింది. ఇక ఇప్పుడు ఎపిక్ అనే సినిమా చేస్తుంది. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. ఈ సినిమా తప్ప వైష్ణవి చేతిలో మరో సినిమాలేదు. దాంతో ఈ సినిమా పై భారీ ఆశలు పెట్టుంది ఈ అమ్మడు. ఎపిక్ సినిమా హిట్ అయితే ఈ చిన్నదానికి అవకాశాలు క్యూ కడతాయి. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ అమ్మడు. రెగ్యులర్ గా ఫోటోలు పంచుకుంటూ అభిమానులను ఆకట్టుకుంటుంది. గ్లామరస్ ఫోటోలతో పాటు ట్రెడిషనల్ ఫోటోలను కూడా పంచుకుంటుంది ఈ కుర్ర భామ.



## స్టార్ హీరోయిన్ కావాల్సింది.. ఇప్పుడు 12 వేల కోట్ల ఆస్తికి యజమాని..

అందాల రాణిగా కెరీర్ ప్రారంభించింది. కథానాయిక తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకోవాలని కలలు కంది. దక్షిణాది చిత్రాలతో తన కెరీర్ మొదలుపెట్టింది. ఆమె ప్రతిభా వంతురాలైన మోడల్. భారతదేశంలోని అత్యంత ధనవంతులైన బ్యాంకర్ల కుటుంబానికి చెందిన ఈ అమ్మడు. హీరోయిన్ గా మాత్రం రాణించలేకపోయింది. తెలుగులో ఒక్క సినిమాతోనే గ్లామర్ బ్యూటీగా తెరంగేట్రం చేసింది. నటిగా మారకముందు మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టింది. అందాల పోటీలో విజేతగా నిలిచింది. దక్షిణాది చిత్రాలతోనే నటిగా కెరీర్ స్టార్ట్ చేసింది. డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో నందమూరి హీరో కళ్యాణ్ రామ్ ప్రధాన పాత్రలో నటించిన ఇజం చిత్రంతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైంది. మొదటి సినిమాతోనే అందం, అభినయంతో ప్రేక్షకులను కట్టిపడేసింది. కానీ ఈ సినిమా ఆశించిన స్థాయిలో ఆక్టటుకోలేకపోయింది. కానీ నటిగా ఈ అమ్మడు మాత్రం అందరి దృష్టిని ఆకర్షించింది. తెలుగుతోపాటు కన్నడోల తంత్ర, స్పాట్ లైట్ 2 వంటి చిత్రాల్లో నటించింది. అలాగే రణవీర్ సింగ్ సరసన 83 చిత్రంతో బాలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. మనం మాట్లాడుకుంటున్న హీరోయిన్ పేరు ఆదితి ఆర్య. సినిమాలను వదిలేసి ఇప్పుడు వైవాహిక జీవితంలో సంతోషంగా ఉంది. ఆమె భారతదేశంలోని అత్యంత ధనవంతులైన బ్యాంకర్లలో ఒకరైన ఉదయ్ కోటక్ కుమారుడైన జై కోటక్‌ను వివాహం చేసుకుంది. అదితి ఆర్య చండీగఢ్‌లో జన్మించి, తన ప్రాథమిక విద్యను అక్కడే పూర్తి చేసింది. ఫైనాన్స్, బిజినెస్ స్టడీస్‌లో గ్రాడ్యుయేషన్‌ను పూర్తి చేసింది. ఎఫ్‌బిబి ఫెమినా మిస్ ఇండియా వరల్డ్ 2015లో అదితి విజేతగా నిలిచింది. తెలుగు, కన్నడ, హిందీ భాషలలో ఆమె నటించిన సినిమాలన్నీ అట్టర్ ప్లాప్ అయ్యాయి. కెరీర్ మంచి ఫాంలో ఉండగానే సినిమాలను వదిలేసి జై కోటక్‌ను పెళ్లి చేసుకుని వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టింది. నివేదికల ప్రకారం ఇప్పుడు జైకోటక్ ఆస్తులు రూ.12 వేల కోట్లకు పైగా ఉన్నట్లు సమాచారం.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com